# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం

హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

ఆదివారం 01 | ఫిబ్రవరి, 2026 | పేజీలు :08




# జనం నుండి వనంలోకి వన దేవతలు





## చివరి రోజు కావడంతో
## పెద్ద ఎత్తున భక్తులు
## ముగిసిన చింతలగట్టు వట్టేవాగు జాతర

**ప్రజాపక్షం/గూడూరు;** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని మచ్చర్ల శివారు చింతలగట్టు వట్టేవాగు సమ్మక్కసారలమ్మ మహాజాతర నాలుగు రోజుల నుండి అత్యంత వైభవంగా జరిగింది నాలుగు రోజులలో 20 లక్షల మంది మొక్కులు చెల్లించుకున్నారు.చివరి రోజు కూడా వేలాదిమంది భక్తులు వచ్చి వనదేవతలు ను డప్పు చప్పుళ్ళు డోలు వాయిద్యాలతో కృత్యాలు చేస్తూ శివశక్తులు పూనకాలతో అమ్మావారికీ మొక్కులు చెలించుకున్నారు.చింతలగట్టు వట్టేవాగు జాతర చివరి రోజైన శనివారం వనదేవతలను వన ప్రవేశం చేస్తారు.మచ్చర్ల శివారు కొమురభీమ్‌నగర్ కు గోవిందరాజు ను జగన్నాయకులగూడెం కు పగిడిద్దరాజు కొత్తగూడ మండలం గోపాలపురం కు నాగులమ్మ ను బయ్యారం మండలం గురిమిల్ల కు జంపన్న మట్టెవాడ కు సారలమ్మ సూర్యుని గుట్ట కు సమ్మక్కను తల్లులు తిరిగి(వనం)లోకి ప్రవేశిస్తారు. ఈసమయంలో ఆదివాసులు దారం సిద్దు తో పూజారులు జాతర కమిటి ఆధ్వర్యంలో భరిణెలను వస్తువులను భక్తిశ్రద్దలతో తిరిగి అడవికీ తరలిస్తారు. వన ప్రవేశం చివరి ఘట్టం నాలుగు రోజులు జాతర ముగిసిన తర్వాత (సాధారణంగా శనివారం) సమ్మక్కసారలమ్మలు వనంలోకి వెళ్లారు.ఆదివాసీలు పూజారులు పూజా కార్యక్రమాలు సూర్యునిగుట్ట పై రహస్య పూజలు నిర్వహించి కుంకుమ భరిణెలు మరియు ఇతర వస్తువులు తీసుకువస్తారు. తిరుగు ప్రయాణం చింతలగట్టు గద్దెల నుంచి తల్లులు వనంలోకి తిరిగి వెళ్లే ప్రక్కియ అత్యంత వేడుకగా భక్తిశ్రద్దలతో జరుగుతుంది.ఆదివాసీలు సాంప్రదాయ రీతిలో ఈ ప్రయాణాన్ని జరుపుతారు.ముగింపు ఈ వన ప్రవేశంతో చింతలగట్టు వట్టేవాగు జాతర ముగుస్తుంది.

# సమ్మక్క - సారలమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/భూపాలపల్లి:**భూపాలపల్లి మండలం గుర్రంపేట గ్రామంలో జరుగుతున్న శ్రీ సమ్మక్క సారలమ్మ మినీ మేడారం జాతరలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొని, వన దేవతలను దర్శించుకుని మొక్కులను చెల్లించారు. కాగా, జాతర కమిటీ నిర్వాహకులు, గ్రామ సర్పంచ్, కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యేకు శాలువాలు కప్పి డప్పు చప్పుళ్ళతో స్వాగతం పలికారు. గుర్రంపేట శ్రీ సమ్మక్క సారలమ్మ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు.

**మేడారం సమ్మక్క సారక్కలను**



**దర్శించుకున పోదెం**

మేడారం గద్దెలపై కొలువై ఉన్న శ్రీ సమ్మక్క సారలమ్మ వనదేవతలను తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ములుగు మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య కుటుంబ సతీసమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా సమ్మక్క సారక్క దేవతల ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరికీ సుభిక్షం శాంతి, సుఖసంతోషాలు కలగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్యాలయ సందర్శన



**ప్రజాపక్షం/భూపాలపల్లి:** మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు ఫణీంద్ర రెడ్డి శనివారం మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నామినేషన్ల పరిశీలన ప్రక్రియను ఎన్నికల నిబంధనల ప్రకారం పూర్తిగా పారదర్శకంగా, జాగ్రత్తగా నిర్వహించాలని ఆదేశించారు. అర్హత గల నామినేషన్లను మాత్రమే చెల్లుబాటు చేయాలని, ఎటువంటి పొరపాట్లకు అవకాశం లేకుండా ప్రతి నామినేషన్‌ను నిశితంగా పరిశీలించాలని సూచించారు. అలాగే, చెల్లుబాటు అయిన అభ్యర్థుల జాబితాను తక్షణమే ప్రజలకు తెలిసే విధంగా మున్సిపల్ కార్యాలయ నోటీస్ బోర్డులో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, రిటర్నింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీ విజయానికి సంపూర్ణ సహకారం అందిస్తాం

## సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ మాజీ సభ్యుడు తమ్మెర విశ్వేశ్వర్‌రావు



**ప్రజాపక్షం/తొర్రూరు :** మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి సంపూర్ణ సహకారం అందిస్తామని సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ మాజీ సభ్యులు తమ్మెర విశ్వేశ్వర్‌రావు అన్నారు. పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, టిపిసిసి వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీరాజేందర్‌రెడ్డి పిలుపు మేరకు తొర్రూరు మున్సిపాలిటీ ఎన్నికల్లో సిపిఐ పార్టీ పోటీ చేయడం లేదని సిపిఐ రాష్ట్ర నాయకులు తమ్మెర విశ్వేశ్వర్‌రావు ప్రకటించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వర్‌రావు మాట్లాడుతూ తొర్రూరు మున్సిపాలిటీలో 16 వార్డులకు గాను 16 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించి మున్సిపాలిటీపై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగిరేలా ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే విజ్ఞప్తిని గౌరవిస్తూ ప్రజా ప్రయోజనాలు, పట్టణ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. తొర్రూరు పట్టణ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నామని సిపిఐ నాయకులు తెలిపారు.సిఎం రేవంత్‌రెడ్డి ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రతీ ఒక్కరికి అర్థమయ్యే రీతిలో అవగాహన కల్పించాలన్నారు. ఝాన్సీరెడ్డి మాట్లాడుతూ తొర్రూరు పట్టణ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐ టియు జిల్లా గౌరవ అధ్యక్షులు ఓమ బిక్షపతి,సిపిఐ పార్టీ మండల కార్యదర్శి బందు మహేందర్, సిపిఐ జిల్లా నాయకుడు ఘనపురం లక్ష్మణ్, మండల సహాయ కార్యదర్శి , తొర్రూరు పట్టణ కార్యదర్శి ముద్రబోయిన వెంకన్న పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

## ఎఎస్‌పి,రవాణా శాఖ అధికారి



**ప్రజాపక్షం/మహాదేవపూర్;**రోడ్డు భద్రతా నియమాలు పాటించి ప్రమాదాలను నివారించాలని జిల్లా ఎస్పీ నరేష్ కుమార్,జిల్లా రవాణా శాఖ అధికారి మహ్మద్ సందాని అన్నారు.శనివారం మండలకేంద్రంలోని గ్రీన్‌వుడ్ పాఠశాలలో రవాణా శాఖ ఆధ్వర్యంలో జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సిఐ వెంకటేశ్వర్లు,కాటారం ఏఎంసి చైర్మెన్ పంతకాని తిరుమల సమ్మయ్య,అసిస్టెంట్ మోటర్ వేకిల్ ఇన్స్‌పెక్టర్లు సుందర్ లాల్,శ్రీనివాస్,మండల విద్యాధికారి పురుషోత్తం రెడ్డి,సర్పంచ్ హసీనా బానో అక్బర్ ఖాన్,గ్రీన్‌వుడ్ పాఠశాల కరస్పాండెంట్ చీర్ల శ్రీనివాస్ రెడ్డి,ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ రెడ్డి,వైస్ ప్రిన్సిపల్ జన్ను రవి గుడ్‌మార్నింగ్ పాఠశాల ప్రిన్సిపల్ సూర్యజిత్,పాల్గొన్నారు ఈ సందర్భంగా జిల్లా రవాణా శాఖ అధికారి సందాని విద్యార్థులను ఉద్దేశించి రోడ్డు భద్రతపై అవగాహన కల్పించి రహదారి నియమాలు పాటిస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుండే రోడ్డు భద్రతా నియమాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండడం అత్యంత అవసరమని అన్నారు.ముఖ్యంగా రోడ్డ దాటేటప్పుడు జాగ్రత్తలు పాటించడం,హెల్మెట్,సీట్ బెల్ట్ వినియోగం,ట్రాఫిక్ సిగ్నల్స్‌ను కచ్చితంగా పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని అన్నారు.విద్యార్థులు రోడ్డు భద్రతకు సంబంధించిన అంశాలనుకుటుంబ సభ్యులు,స్నేహితులకు తెలియజేసి రోడ్డు భద్రతపైఅవగాహన కలిగించేలా బాధ్యత తీసుకుని ప్రమాదాల నివారణకు తమవంతుగా కృషి చేయాలని అన్నారు.రోడ్డు భద్రతా నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలు జరగకుండా మన కుటుంబాలతో పాటు ఇతరుల కుటుంబాల ప్రాణాలను కాపాడినవారమౌతామని అన్నారు.ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించి సురక్షిత ప్రయాణాలు చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో రోడ్డు భద్రత ప్రతి పౌరుడి బాధ్యతగా భావించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు,విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# సమ్మక్క-సారలమ్మ జాతర ముగింపు

## జాతర కమిటీ అధికారుల సమన్వయంలో విజయవంతమైన జాతర నిర్వహణ



**ప్రజాపక్షం/గూడూరు;**సమ్మక్క సారలమ్మ వన ప్రదేశానికి వెళ్లే సమయంలో జాతర ముగింపు అత్యంత అంగరంగ వైభవంగా జరిగింది.జాతర ముగింపు వేడుకల్లో తహసీల్దార్ నాగా భవాని డిప్యూటి తహసీల్దార్ కోమాల వాయిద్యాలు వాయిస్తూ నృత్యాలు చేయడం భక్తులకు ఆకట్టుకుంది. సంప్రదాయ పద్ధతిలో నిర్వంధించిన ఈకార్యక్రమం భక్తుల్లో విశేష ఉత్సాహాన్ని నింపింది.

**పోలీసుశాఖ ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు**

జాతర సందర్బంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా గూడూరు సీఐ సూర్యప్రకాష్ ఎస్సై గిరిధర్ రెడ్డి ఆధ్వర్యంలో పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సుమారు 20 లక్షల మందికి పైగా భక్తులు హాజరైనపకపటికీ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.ట్రాఫిక్ సమస్యలు లేకుండా పర్యవేక్షణ జాతర ప్రాంతాలకు వచ్చే మార్గాల్లో ట్రాఫిక్ జామ్ ఏర్పాడకుండా పోలీసులు నిరంతరం పర్యవేక్షించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తిన చోట వెంటనే చర్యలు తీసుకోని భక్తులకు ఇబ్బంది కలగకుండా సజావుగా రాకపోకలు జరిగేలా చర్యలు చేపట్టారు. ఈ కృషితో జాతర ప్రశాంత వాతావరణంలో కొనసాగింది.

**జాతరలో వైద్య శిబిరాలు**

భక్తులకు మెరుగైన సేవలు అయోధ్యపురం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలు భక్తులకు ఎంతో ఉపయోగపడ్డాయి.అత్యవసర చికిత్సలు ప్రాథమిక వైద్య సేవలు అందిస్తూ భక్తులకు ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యం ఇచ్చారు.

**జాతర కమిటి వాటంటీర్లు సేవలు ప్రశంసనీయం**

జాతర వాలంటీర్లు జాతర కమిటి సభ్యులు ఐదు రోజులు పాటు అంకితభావంతో సేవలందించారు.భక్తులకు మార్గదర్శనం చేయడం అవసరమైన సహాయం అందించడం వంటి పనుల్లో చురుకుగా పాల్గొన్నారు. వారి సేవలు జాతర విజయానికి ప్రధాన కారణంగా నిలిచాయి

**జాతర కమిటీ కృతజ్ఞతలు**

ఈ సందర్బంగా జాతర విజయవంతంగా నిర్వహించిన అధికారులకు పోలీసు శాఖకు వైద్య సిబ్బందికి వాలంటీర్లకు రెవెన్యూ శాఖకు జాతర ప్రధాన పూజారి దారం సిద్దు జాతర అధ్యక్షుడు కారం లక్ష్మయ్య ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అందరికి సమన్వయంతో సమ్మక్క సారలమ్మ జాతర ఘనంగా ముగిందని పేర్కొన్నారు.

# రివిజన్ మ్యాపింగ్ ప్రక్రియ వేగవంతం



**ప్రజాపక్షం/భూపాలపల్లి :**స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేస్తామని జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ తెలిపారు. శనివారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ నిర్వహణపై అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు ఐడిఓసి కార్యాలయం నుండి జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ జిల్లాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ 60 శాతం జరిగినట్లు తెలిపారు. జిల్లాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ మ్యాపింగ్ ప్రక్రియను మరింత వేగవంతం చేసి, శాతం పెంచేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ మ్యాపింగ్‌లో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా ప్రతి ఇంటి నుండి ఖచ్చితమైన వివరాలు సేకరిస్తామని అన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ మ్యాపింగ్ శాతాన్ని పెంచేందుకు బూత్ లెవల్ ఆఫీసర్లు తప్పనిసరిగా ఫీల్డ్ విజిట్ చేసేలా ఆదేశాలు ఇస్తామని తెలిపారు. ఇంటింటి సర్వే ద్వారా ఓటర్ల వివరాలను నిర్ధారించి, శాతం పెంచే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు తమ బూత్ లెవల్ ఏజెంట్లు ను వెంటనే నియమించుకునేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. మ్యాపింగ్ సమయంలో తప్పు ఎంట్రీలు, తప్పు లింకింగ్‌లు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు. ఓటర్ల సౌలభ్యం కొరకు బుక్ ఎ కాల్ (Book a Call) సదుపాయంపై విస్తృత ప్రచారం నిర్వహిస్తామని తెలిపారు.ప్రతి ఓటరు పేరు సరైన పోలింగ్ స్టేషన్‌కు మ్యాప్ కావడం ప్రజాస్వామ్యానికి కీలకమని, అధికారులు, సిబ్బంది పూర్తి బాధ్యతతో పని చేయాలని జిల్లా ఎన్నికల అధికారి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఎన్నికల విభాగం పర్యవీక్షకులు అబ్బాస్, నవీన్ పాల్గొన్నారు.

# బాలకారిక వ్యవస్థ నిర్మూలనకు పోలీస్‌ల కట్టుదిట్టమైన చర్యలు



**ప్రజాపక్షం/భూపాలపల్లి :**బాల కార్మికుల నివారణ కొరకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆపరేషన్ స్మైల్ XII దశలో జిల్లా వ్యాప్తంగా 70 మంది బాలకారికలను గుర్తించి వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చినట్లు జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ కార్యక్రమం కోసం 02 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఇందులో భాగంగా జనవరి 1 నుండి జనవరి 31 వరకు నెల రోజుల పాటు ఆపరేషన్ స్మైల్ XII కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా 70 మంది బాల కార్మికులను గుర్తించడమైంది అని తెలిపారు. వారిలో 55 మంది బాలురు, 15 మంది బాలికలు ఉన్నారని వివరించారు. భూపాలపల్లి సబ్ డివిజన్‌లో మొత్తం 23 మంది బాల కార్మికులు ఉండగా, అందులో బాలికలు 07 ఉండగా, 21 మంది బాలురు ఉన్నారు. కాటారం సబ్ డివిజన్‌లో మొత్తం 47 మంది బాల కార్మికులు ఉండగా, అందులో 39 మంది బాలురు, 08 మంది బాలికలు ఉన్నారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా గుర్తించిన మొత్తం 70 మంది బాలకారికలను వారి తల్లిదండ్రులకు అప్పగించడం జరిగిందని వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా చిన్న పిల్లలను ప్రమాదకరమైన ప్రదేశాల్లో పనిలో పెట్టుకున్న యజమానులపై కేసులు నమోదు చేసి, బాలకార్మికులను వారి తల్లిదండ్రులకు అప్పగించడం జరిగిందని తెలిపారు. 14 సంవత్సరాల లోపు గల బాలలను ఎలాంటి పనుల్లోనూ పెట్టరాదని, అలాగే 15 నుండి 18 సంవత్సరాల వయస్సు గల బాలలను ప్రమాదకరమైన పనుల్లో పెట్టడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. బాలకార్మికులుగా ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆపరేషన్ స్మైల్ XII కార్యక్రమంలో పోలీస్ శాఖ విద్యాశాఖ కార్మిక శాఖ డిస్టిక్ చైల్డ్ ప్రొటెక్షన్ విభాగం సమన్వయంతో పని చేసి, 70 మంది బాల కార్మికులను విముక్తులుగా చేసినందుకు జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అభినందించారు.

# మేడారం జాతర నిర్వహణలో సర్కారు ఘోర వైఫల్యం

రెడ్కో మాజీ చైర్మన్ వై సతీష్ రెడ్డి

**ప్రజాపక్షం/ములుగు:** ఆసియాలోనే అతి పెద్ద గిరిజన జాతర అయిన మేడారం సమ్మక్క సారలమ్మ జాతర నిర్వహణలో కాంగ్రెస్ సర్కారు ఘోరంగా విఫలమ య్యింది. పవిత్రమైన వనదేవతల జాతరను మంత్రి, పోలీసులు తమ రీల్స్ పబ్లిసిటీ స్పాట్‌గా మార్చుకు న్నారు. పని పక్కన పెట్టి మరీ పబ్లిసిటీ స్టంట్‌లు చేస్తు న్నారు. ఫలితంగా లక్షలాది మంది భక్తులు ఇబ్బం దుల పాలవుతున్నారు. అమ్మవార్ల దర్శనానికి వచ్చిన లక్షలాది మంది భక్తులకు బస్సులు లేవు. కనీసం అక్కడి భక్తులకు తాగడానికి నీళ్ల లేవు, మహిళలకు, చంటి పిల్లలకు ఎలాంటి సౌకర్యాలు లేవు, చంటి పిల్ల లకు ఎలాంటి సౌకర్యాలు లేవు. చంటి పిల్లలకు ఏదైనా సమస్య వస్తే చూడడానికి కనీసం డాక్టర్లు లేరు. పోలీసు ఉన్నతాధికారులు ట్రాఫిక్ నియంత్రణపై ఫోకస్ పెట్టకపోవడం వలన కిలోమీటర్ల కొద్ది ట్రాఫిక్ జామ్ అయ్యింది. 20 నుండి 30 కిలోమీటర్ల దూరం ప్రయాణించడానికి 6 నుండి 7 గంటల సమయం పడుతోంది. 40 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయ్యింది. అంటే ప్రయాణం ఎంత నరకంగా మారిందో అర్థం చేసుకోవచ్చు.

శుక్రవారం రోజు భక్తుల తాకిడి పెరగడంతో ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రమైంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జాతర ప్రారంభం కాకముందే వచ్చి హడా పుడి చేసి పోయారు. పోలీసులు కూడా అప్పటి నుండే సోషల్ మీడియాలో వీడియోలతో హోల్చల చేశారు. కానీ తీరా ఇప్పుడు కోట్లాది మంది భక్తులు వచ్చే సమ యంలో పూర్తిగా చేతులెత్తేశారు. మేడారంలో ఉన్న మంత్రి సీతక్క వచ్చే వివిపిలకు రిసీవ్ చేసుకొని దర్శనం చేయించే పనిలో ఉంటున్నారు. ఐపిఎస్ అధి కారులు కూడా వారి చుట్టూనే తిరుగుతున్నారు. వివి పిలు లేనప్పుడు అక్కడే ఉన్న కమాండ్ కంట్రోల్ సెంట ర్‌లో సేద తీరుతున్నారు. కానీ సాధారణ భక్తులను మాత్రం పట్టించుకోవడం లేదు.

**గద్దెల దగ్గర ఇవే ఇబ్బందులు...**

ఎలాగోలా తిప్పలు పడి గద్దెల దగ్గరకు చేరినా అక్కడ కూడా ఇదే పరిస్థితి ఏదో అభివృద్ధి చేశామని చెప్పు కున్న కాంగ్రెస్ సర్కారు భక్తులకు కొత్త తిప్పలు తీసు కొచ్చి పెట్టింది.

మాస్టర్ ప్లాన్ పేరుతో గద్దెల దగ్గరకు వెళ్లేం దుకు ఒకే మార్గాన్ని ఏర్పాటు చేసింది. దీనితో గద్దెల దగ్గర భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పోలీ సులు రీల్స్ కంటే కూడా రియల్ డ్యూటీపై ఫోకస్ పెట్ట డంతో ప్రజలు సాఫీగా వచ్చి అమ్మవార్లకు మొక్కులు చెల్లించి పోయారు. కానీ ఇప్పుడు అటు పోలీసులు ఇటు మంత్రి అంతా రీల్స్ పబ్లిసిటీ స్టంట్లకు పరిమితి కావడంతో భక్తులు ఆగ్రహించి ఏకంగా మంత్రి వాహ నంపైనే దాడి చేసే పరిస్థితి వచ్చిందంటే జాతర నిర్వ హణలో రేవంత్ సర్కార్ ఏ స్థాయిలో విఫలమైందో అర్థం చేసుకోవచ్చు.

# యువకులు క్రీడల్లో రాణించాలి



**ప్రజాపక్షం/కొడకండ్ల:** యువకులు క్రీడలలో రాణించాలని కొడ కండ్ల సర్పంచ్ దూలం మమత సతీష్‌గౌడ్ అన్నారు. శనివారం కొడ కండ్ల మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో శనివారం సీఎం కప్ 2026 మండల స్థాయి క్రీడలు ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో నాగశేషాద్రి సూరి అధ్యక్షతన, ఎంఈవో కన్వీనర్‌గా ఈ పోటీలు జరుగగా కొడకండ్ల సర్పంచ్ దూలం మమత సతీష్‌గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలోని యువకులు క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలనే లక్ష్యంతో ప్రభుత్వం సీఎం కప్ క్రీడలను నిర్వహిస్తుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి సహకారంతో క్రీడాకారులకు అన్ని విధాల ప్రోత్సాహం అందిస్తా మని హామీ ఇచ్చారు. గెలుపు ఓటములు సహజమని, ఓటమిని గెలు పుకు బాటగా మలచుకోవాలన్నారు. అనంతరం విజేతలకు అధికా రులు, ప్రజాప్రతినిధులతో కలిసి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాకాల సర్పంచ్ అనూష యుగందర్ రెడ్డి, ఉపాధ్యా యులు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

# అమ్మ చారిటబుల్ ట్రస్ట్ చేయూత



**ప్రజాపక్షం/పాలకుర్తి:** మండల కేంద్రంలో అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన పాని పూరి కుటుంబానికి అండగా నిలిచిన అమ్మ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు నిరుపేద కుటుంబా నికి బియ్యం, కూరగాయలు, నిత్యావసర సరు కులు అందించడం జరిగింది. ఈ కార్యక్ర మంలో ట్రస్ట్ చైర్మన్ యతిపతి శ్రీకాంత్, ట్రస్ట్ కోశాధికారి ఒర్రె కుమారస్వామి, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# రైల్వే ఉద్యోగానికి ఎంపికైన శ్రావణి



**ప్రజాపక్షం/కాళేశ్వరం:** పట్టుదలతో ముందుకు సాగుతే సాధ్యం కానిదేది ఉండ దని నిరూపించింది కాళేశ్వరం గ్రామానికి చెందిన సరస్వతి కుసుమం శ్రావణి జయశం కర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం గ్రామా నికి చెందిన గుగులోత్ శ్రావణి చిన్నప్పటి నుండి పేదరికం,కష్టాల మధ్య అనేక అడ్డంకు లను అధిగమించి పట్టుదలతో ముందుకు సాగి తన చదువును కొనసాగించింది. ఆమె రైల్వే రిక్రూట్ మెంట్ బోర్డ్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచి రైల్వే ఉద్యోగం ఎంపికలో విజయం సాధిం చింది. అంతే కాకుండా ఆమె హాజరైన మరో మూడు ఉద్యోగాల ఎంపికలో నియామకాల పత్రాలను త్వరలో అందుకోనున్నట్లు తెలిపింది. ఆమె కష్టా లకు తగిన ఫలితం దక్కడంతో ఆమె కుటుంబంలో ఆనందభాష్పాలు నింపాయి. స్థానికులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.

# మేడారం జాతరలో మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది



**ప్రజాపక్షం/ములుగు:** మేడారం మహా జాతరలో మున్సిపల్, పంచాయతీ రాజ్ హెల్త్ వర్కర్స్ అధికారి నుండి కింది స్థాయి పారిశుద్ధ్య కార్మికుల వరకు సుమారు 5వేల మంది నిత్యం 24 గంటలు అందుబాటులో ఉంటూ రోడ్లు, మరుగుదొడ్లు, పారిశుద్ధ్యం నిర్వహణ చేస్తూ సేవలు అందిస్తున్నారు. జాతరకు నెల రోజుల ముందు నుండి పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, జాతర అనంతరం కూడా పారిశుద్ధ్య కార్యక్రమాలు కొనసాగుతాయని సంబంధిత అధికారులు చెప్పారు. తెలంగాణ, ఆంధ్రప్ర దేశ్ నుండి ఈ హెల్త్ సానిటేషన్ వర్కర్లను తీసుకోవడం జరిగిందని, డిపిఓ, డివిజనల్ పిఓలు, ఎంపిడిఓలు, ఎంపిఓలు, పంచాయతీ సెక్రటరీలు, తదితరులు నిత్యం అమ్మవారి గద్దెల ప్రాంగణం ఇతర కార్యాలయాలు అధి కారుల నివాస ప్రాంతాలు, రహదారుల వెంబడి, మరు గుదొడ్ల పరిశుభ్రత, క్లీనింగ్, బ్లీచింగ్ తదితర ప్రదేశా లలో అంకితభావంతో సానిటేషన్ పనులు నిర్వహిస్తూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా హెల్త్ సమ స్యలు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటు పారి శుద్ధ్య కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుంది. సేకరిం చిన చెత్త వేస్టేజిని ప్రత్యేక ట్రాక్టర్లు, ట్రాలీ ఆటోలు తది తర వాహనాల ద్వారా సెగ్రిగేషన్ చేసి తరలించడం జరుగుతుంది. అధికారులు జాతరలో సేవ చేయడం ఎంతో సంతోషంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. జాతర నిర్వహణలో గ్రామీణ మంచినీటి సరఫరా త్రాగు నీరు అందించడం, హెల్త్ శానిటేషన్ పనులు, వైద్యారో గ్యశాఖ, విద్యుత్, తదితర మహా జాతరలో సెక్టార్ విభా గాల వారీగా సేవలు విధులు నిర్వహిస్తున్నారు.

# సమ్మక్క సారలమ్మ పూజారులకు సన్మానం

**ప్రజాపక్షం/జఫర్‌గఢ్:** మండల కేంద్రంలో సమ్మక్క సారలమ్మ పూ జలు నిర్వహిస్తున్న పూజారులను లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సన్మా నించడం జరిగింది. శనివారం సమ్మక్క సారలమ్మ పూజారులకు లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ జఫర్‌గఢ్ ఆధ్వర్యంలో రీజియన్ చైర్మన్ పొన్నాల సంయుక్త సహాయంతో దుప్పట్ల పంపిణీ కార్యక్రమం నిర్వ హించి శాలువాలతో సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షులు పూర్ణచందర్, గ్రామ సర్పంచ్ మోహన్‌రావు, స్టేషన్‌ఘనపూర్ క్లబ్ ట్రెజరర్ అశోక్, సెక్రటరీ అంచూరి యుగం ధర్, ట్రెజరర్ బాలరాజు, సభ్యులు రాజ్‌కమల్, రాజు, శ్రవణ్, శ్రీధర్, వెంకటేశ్వర్లు, సంతోష్, శివప్రసాద్, రత్నాకర్, సమ్మక్క సార లమ్మ కమిటి సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి రూ.50వేల ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం/తరిగొప్పుల:** మండలంలోని అబ్దు ల్ నాగారం గ్రామానికి చెందిన కాసర్ల రాజి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా విషయం తెలుసుకున్న గ్రామ ప్రజలు మానవత్వం చాటు కున్నారు. శనివారం బాధిత కుటుంబానికి రూ.50వేలు వారి కుమార్తెలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కావటి సుధాకర్, మాజీ ఉప సర్పంచ్ రాజు, రమేష్, కనకరాజు, బాలకుమార్, నరసింహులు, నరేష్, నవీన్, బాలరాజ్, శ్రవణ్, సందీప్, నరేష్, రాజు, ఐలయ్య, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

# కులం పేరుతో దూషించిన జిపిఓపై చర్యలు

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్ ను కోరిన శ్రీనువాస్

**ప్రజాపక్షం/గూడూరు:** కులం పేరుతో దూషించి భయభ్రాంతులకు గురిచేసిన గూడూరు జిపిఓపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని వాంకుడోత్ శ్రీనువాస్ శనివారం జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ కోరారు.ఈసందర్భంగా శ్రీనువాస్ మాట్లాడుతూ తాను ఈనెల 28 తారీకు నా సొంత పొలంలో ఉదయం నుండి సాయంత్రం 6 గంటలకు వరకు వట్టిపోసి చదును చేయగా అదే రోజు రాత్రి 9 గంటలకు జిపిఓ ను అంటూ ఒక నెంబర్ నుండి ఫోన్ చేసి నాకులం పేరుతో నన్ను నానా బూతులు తిడుతూ ఎక్కడ ఉన్నావు నీ పొలం దగ్గరికి రా అంటూ నన్ను బెది రింపులకు గురి చేశారు. నేను అక్కడికి వెళ్లేసరికి అక్కడ ఉన్న వ్యక్తులు మద్యం సేవించి మద్యం మత్తులో నన్ను నానా బూతులు తిట్టి నాపై దౌర్జన్యం చేశారు.ఈ విషయంపై వారిపై పోలీస్ స్టేషన్‌లో నేను ఫిర్యాదు చేసిన పోలీసులు వారు పట్టించుకోవడం లేదని ఆయన తెలిపారు. పైగా నాపైనే కేసు నమోదు చేశారని ఆయన ఆవే దన వ్యక్తం చేశారు.నన్ను కులం పేరుతో దూషించిన అబ్బాస్ రాము భరత్ పై ఎస్‌టి,ఎస్‌సి చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# పౌరులు తమ హక్కులు పొందాలి

**ప్రజాపక్షం/తరిగొప్పుల:** సమాజంలో పౌరు లందరు తమ హక్కులను పొందాలని ఆర్ఐ ఆంధ్రయ్య అన్నారు. మండల కేంద్రంలో శని వారం నాడు పౌర హక్కుల దినోత్సవ సంద ర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పౌరుడు తమ హక్కులను వినియోగించుకోవ డంతోపాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై అవ గాహన కలిగి ఉండాలని సూచించారు. నిమ్న జాతుల వారిని కించపరిస్తే చట్ట ప్రకారం శిక్ష పడుతుందన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అర్జుల జ్యోతి, ఎంపీవో కృష్ణవేణి, కార్య దర్శి భాగ్యలక్ష్మి, ఏఎస్ఐ సంజీవ, పింగిలి వేణుగోపాల్‌రెడ్డి, అజయ్, మహిపాల్, రాజేష్,గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ హయాంలోనే తొర్రూరు అభివృద్ధి

**ప్రజాపక్షం/తొర్రూరు :** బీఆర్ఎస్ పార్టీ హయాంలోనే తొర్రూరు మున్సిపాలిటీ ఎంతో అభివృద్ధి జరిగిందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. తొర్రూరు పట్టణంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారం చేస్తూ కాంగ్రెస్ పార్టీపైన, సీఎం రేవంత్ రెడ్డిపైన విమ ర్శలు గుప్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఎన్ని కల ప్రచారాలు జోరందుకున్నాయి. శనివారం తొర్రూరు పట్టణ కేంద్రంలోని ఐదవ వార్డులో మున్సిపల్ ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని చేపట్టగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఇంటింటి ప్రచారం నిర్వహిం చారు. ప్రచారానికి ముందు హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలోనే తొర్రూరు మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ అనేక హామీలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిం దని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మాయమాటలు చెప్పి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. గ్యాస్ సిలిండర్ సబ్సిడీ విషయంలో ప్రజలను మోసం చేశారని ఆరోపిం చారు. గిరిజనుల అభివృద్ధికి కేసీఆర్ ఎంతో కృషి చేశా రని చెప్పారు. మహిళలకు పంపిణీ చేస్తున్న ఇందిరమ్మ చీరెల విషయంలో కమిషన్ల కోసం మహిళా సంఘాల పేరుతో భారీ కుంభకోణం జరిగిందని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతుల పక్షాన నిలిచిన గొప్ప నాయకుడు కేసీఆర్ అని అన్నారు. రైతుబంధు, రైతు భరోసా వంటి పథకాల ద్వారా రైతులకు అండగా నిలి చారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ మేనిఫె స్టోలో లేని ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజల మన్ననలు పొందారని తెలిపారు. మున్సిపాలిటీ ఎన్ని కల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ఐదవ వార్డులో పార్టీ అభ్యర్థి మచ్చ సురేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్ర మంలో జిల్లా, మండల స్థాయి బీఆర్ఎస్ పార్టీ నాయ కులు, సీనియర్ కార్యకర్తలు, యువ నాయకులు, సోషల్ మీడియా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి బియ్యం అందజేత

**ప్రజాపక్షం/టేకుమట్ల:** మండలంలోని దుబ్యాల గ్రామానికి చెందిన సంగి మల్లయ్య దశదినకర్మలో భాగంగా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో శనివారం మృతుడి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం 50 కిలోల బియ్యం పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో యూత్ సభ్యులు సంగి రవివర్మ,సంగి రాజశేఖర్,అరుముల్ల రాజు,సంగి శంకర్,సంగి విష్ణు,గజికంటి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/జనగామ టౌన్:** మార్చి 31లోపు అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి కింద ఉన్నత చదువులకై అందించే ఆర్థిక సహాయం కొరకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్సీ అధికారి డా. బి విక్రమ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 202526 సంవత్సరానికి గాను అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం ద్వారా ఎస్సీ విద్యార్థుల ఉన్నత చదువులకు అందించే ఆర్థిక సహాయానికి అర్హులైన ఏదైనా 4 సంవత్సరాల డిగ్రీ చదివిన, చివరి సంవత్సరం చదువుతున్నవారు మార్చి 31 లోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

## క్విజ్ పోటీలలో జెడ్‌పిహెచ్ఎస్ విద్యార్థుల సత్తా

**ప్రజాపక్షం/జనగామ టౌన్:** రోడ్డు రవాణా శాఖ వారు జిల్లా స్థాయిలో నిర్వహించిన క్విజ్ పోటీలలో మొదటి, రెండు స్థానాలలో జెడ్పీహెచ్ఎస్ ధర్మకంచ విద్యార్థులు నిలవడం గర్వకారణమని పాఠశాల హెచ్ఎం కనకయ్య అన్నారు. జిల్లా కేంద్రంలో రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన క్విజ్ పోటీలలో మొదటి స్థానంలో ఎం సంయుక్త, ద్వితీయ స్థానంలో ఎం మల్లిఖార్జున్ నిలిచారు. వీరికి కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

## రేపటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

**ప్రజాపక్షం/జనగామ టౌన్:** ఈ నెల 2వ తేదీ నుంచి 11 వరకు ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి కె జితేందర్ రెడ్డి తెలిపారు. శనివారం ఆయన జిల్లా ప్రాక్టికల్స్ కేంద్రంలోని చీఫ్ సూపరిండెంట్లతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ ఉదయం 9 గంటలకు, మధ్యాహ్నం 2 గంటలకు రోజు రెండు బ్యాచ్‌లలో పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా సైన్స్ విద్యార్థులు 2508, ఒకేషనల్ విద్యార్థులు 2311 ప్రాక్టికల్ పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. ఈ సమావేశంలో డెక్ సభ్యులు శ్రీనివాస్, శేఖర్ పాల్గొన్నారు.

## వ్యవసాయంపై అవగాహన

**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్:** పంట సాగు పద్దతులు,వ్యాపార నైపుణ్యాలు,రైతుల శ్రమను విద్యార్థులు తెలుసుకోవాలని ఆధ్య పాఠశాల చైర్మన్ మాధవిలత అన్నారు. శనివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఆధ్యా పాఠశాలలో వ్యవసాయం,కూరగాయల వ్యాపార నైపుణ్యంపై విద్యార్థులచే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేంద్రీయ పద్దతిలో కూరగాయల సాగు,రైతులు ఎదుర్కోనే కష్టాలు ప్రతి విద్యార్థి తెలుసుకోవాలనే ఉద్దేశంతో విద్యార్థులచే స్టాలు ఏర్పాటు చేసి ఆదాయ వ్యయాలపై అవగాహన కలిగేలా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ రైతు మాకు మహేష్, ఉపాధ్యా యులు, విద్యార్థులు,తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# హక్కుల సాధనకు గొల్ల కురుమలు పోరాటానికి సిద్ధం

**ప్రజాపక్షం/రాయపర్తి:**హక్కుల సాధనకై గొల్ల కురుమలు పోరాటాలకు సిద్ధం కావాలని తెలంగాణ గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం వరంగల్ జిల్లా కార్యదర్శి పరికి మధుకర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పరికి మధుకర్ మాట్లాడుతూ గొల్ల కురుమలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో అనేక పోరాటాల ఫలితంగా సాధించుకున్న 1016, 559 జీవోలను పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. తుమ్మ చెట్లు, పంచరాయి, పోరంబోకు, చెరువు శిఖం పంటకు వీలులేని భూములలో మూగ జీవాల మేత కోసం ఉపయోగించవచ్చని జీవోలు వచ్చాయని ఆయన అన్నారు. జీవోలను అమలు చేసి ప్రతి సొసైటీకి 20 ఎకరాల భూమిని కేటాయించాలని, ప్రమాదవశాత్తు చనిపోయిన గొర్రెల కాపరికి రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, సొసైటీ ఎన్నికలు నిర్వహించాలని, ప్రతి గ్రామంలో సొసైటీ భవనాలు నిర్మించాలని, 50 సంవత్సరాల నిండిన గొల్ల కురుమలకు పెన్షన్ కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హక్కుల సాధనకై పోరాటమే మార్గమని గొల్ల కురుమలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గొల్ల కురుమలు మండల అధ్యక్షుడు చందు మల్లేష్, మండల కార్యదర్శి గాజు యాకయ్య, ఉపాధ్యక్షులు బెల్లి రాజాలు, యాదవ సంఘం పెద్దగొల్ల కసరబోయిన రాజు, చందు కుమార్, అధ్యక్షులు కుంట హనుమంతు, ఉపాధ్యక్షులు కసరబోయిన శ్రీను, కార్యదర్శి చందు సతీష్, కుంట రాజు, బండి లింగయ్య, పనికరా మల్లయ్య, కుంట ప్రభాకర్, ఉడుత రాజు, నాగుల రాంబాబు, బి లింగయ్య, నాగుల రాజు, బూడిక నాగరాజు, దండిగా యాకయ్య, ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

# గద్దర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి ..



**ప్రజాపక్షం / నల్లబెల్లి :**ఆట పాటలతో ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి బహుజన రాజ్యాధికారిమే లక్ష్యంగా గద్దర్ పాటు పడ్డారని వరంగల్ జిల్లా బిసిహక్కుల సాధన సమితి జిల్లా కార్యదర్శి చింతకింది కుమారస్వామి అన్నారు . శనివారం వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేంద్రలంలోని గ్రామ పంచాయితి కార్యాలయంలో ప్రజాగాయకుడు గద్దరు 77వ జయంతిని పురస్కరించుకుని గ్రామ పంచాయతి కార్యాలయలంలో గద్దర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు . ఈ సందర్బంగా చింతకింది కుమారస్వామి మాట్లాడుతూ అగ్రకుల అధిపత్య పాలకుల నియంతృత్వ దోపిడిని ఎదురించి పోరాటం చేశారన్నారు . వెనుక బడిన కులాల అణగారిన వర్గాలలో ప్రశ్నించేతత్వాని నేర్పిన మహా నాయకుడని ,ఎప్పటికైన బహుజనకూలీల కార్మికుల రాజ్యాధికారం రావాలన్నదే గద్దర్ ఆశయం మని చెప్పారు . ఈ కార్యక్రమంలో బట్టు సాంబయ్య ,పరికి కోర్నెల్ ,పరికి రత్నం ,నాగెల్లి శ్రీధర్ ,సురేష్ కుమారస్వామి తదితరులుపాల్గొన్నారు.

# పాడి కౌశిక్‌రెడ్డి అహంకార దోరిణి సరైంది కాదు



**ప్రజాపక్షం / నల్లబెల్లి :**ప్రజలతో ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులు హుందగా ప్రజాస్వామ్యనికి వన్నె తెచ్చే విధంగా వ్యవహరించాలని బిసిహక్కుల సాధన సమితి జిల్లా కార్యదర్శి చింతకింది కుమారస్వామి కోరారు . శనివారం వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరు సమావేశంలో పాల్గోని మాట్లాడుతూ కరీంనగర్ జిల్లా వీణవంక మండలంలో జరుగుతున్న సమ్మక్క సారళమ్మ జాతరకు హుజురబాద్ ఎంఎల్‌ఏ పాడి కౌశిక్‌రెడ్డి హజరై చేసిన హంగమ అహంకార దోరణి సరైంది కాదన్నారు . కుటంబ సభ్యులతో హజరైన ఎంఎల్‌ఏ పాడి కౌశిక్‌రెడ్డి సమ్మక్క సారళమ్మలను దర్శించుకునే సందర్బంగా అప్రస్వామికంగా ప్రవర్తించి జాతరను అవహేళన చేస్తు మాట్లడం పట్ల తప్పు బట్టారు . జాతరలో సినిమా విలన్ లాగ ప్రవర్తిస్తూ రోడ్లపై బైఠాయించి ప్రజలకు అసౌకర్యన్ని కల్పించడమే కాకుండా జాతర బందోబస్తుకు వచ్చిన పోలీసు విధులను అటకం పరుస్తు చెప్పరాని మాటాలతో పదజాలం ఉపయోగించి దూషించడం ఎంత వరకు సమాంజసమాన్నారు . ఈ కార్యక్రమంలో బటుట సాంబయ్య ,పరికి కోర్నెల్ ,సిపిఐ మండల కార్యదర్శి కడియాల క్రాంతికుమార్ ,కుమారస్వామి పాల్గొన్నారు.

# బాధ్యతాయుతంగా నోడల్ అధికారుల విధులు

**ప్రజాపక్షం/ వరంగల్ :** జిల్లాలో నిర్వహిస్తున్న రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లపై నోడల్ అధికారులు పూర్తి అవగాహనతో, అత్యంత బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు కిల్లు శివకుమార్ నాయుడు అన్నారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ డాక్టర్ సత్య శారద, జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు వీరా రెడ్డిలతో కలిసి జిల్లా నోడల్ అధికారులతో కిల్లు శివకుమార్ నాయుడు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాధారణ పరిశీలకులు మాట్లాడుతూ జిల్లాలోని వర్ధన్నపేట, నర్సంపేట మున్సిపాలిటీల్లో ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో, ఎన్నికల సంఘం నిర్దేశించిన నియమ నిబంధనలు, మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని తెలిపారు. ఎన్నికల విధులు అత్యంత కీలకమైనవని, ఎక్కడా ఎలాంటి పొరపాట్లు జరగకుండా సమష్టిగా, సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఎన్నికలకు సంబంధించిన ప్రతి అంశాన్ని ఎన్నికల సంఘం సూచనల మేరకు సమయానికి పూర్తి చేయాలని, అన్ని అంశాలకు సంబంధించిన శిక్షణా కార్యక్రమాలను సమగ్రంగా నిర్వహించాలని ఆదేశించారు. పోలింగ్ రోజున ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు పకడ్బందీగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఎన్నికల సిబ్బంది కేటాయింపు, శిక్షణ, లాజిస్టిక్స్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. నోడల్ అధికారులు తమ విధుల నిర్వహణలో పూర్తి పారదర్శకత, నిష్పక్షపాతత్వంతో వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున నోడల్ అధికారులు నిరంతర పర్యవేక్షణతో క్షేత్రస్థాయిలో పరిస్థితులను సమీక్షించాలన్నారు. ప్రతి అధికారి తమకు కేటాయించిన విధులను అత్యంత బాధ్యతతో, తప్పిదాలకు తావులేకుండా నిర్వహించాలని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో అందరూ అంకితభావంతో సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జెడ్పీ సీఈఓ రామ్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు భాస్కర్, సుధీర్ కుమార్, జిల్లా నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సూరిపల్లిలో బాధిత కుటుంబాలకు భరోసా

**ప్రజాపక్షం/నెక్కొండ:**నెక్కొండ మండలం సూరిపల్లి గ్రామంలో ఇటీవల మృతిచెందిన వారి కుటుంబాలను వరంగల్ జిల్లా మాజీ జడ్పి ఫ్లోర్ లీడర పెద్ది స్వప్న శనివారం పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి, పార్టీ అండగా ఉంటుందని ఆమె భరోసా కల్పించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులతో మాట్లాడిన పెద్ది స్వప్న, కష్టకాలంలో పార్టీ మీకు అండగా నిలవడమే నిజమైన రాజకీయ పార్టీల బాధ్యత అని పేర్కొన్నారు. బాధిత పార్టీ శ్రేనులు పార్టీకి ఎంతో కీలకమని వారి సమస్యలను అధిగమించేందుకు నాయకత్వం కృషి చేస్తుందని ఆమె తెలిపారు. నెక్కొండ మండల భారత రాష్ట్ర సమితి పార్టీ అధ్యక్షుడు సంగని సూర్యతో పాటు సీనియర్ నాయకులు, న్యాయవాది కొమ్ము రమేష్ యాదవ్, మాజీ ఎంపిపి జాటోత్ రమేష్ నాయక్, కారింగుల సురేష్, సారంగపాణి, కట్కూరి నరేందర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ గడ్డం రజిత సురేష్, ఉప సర్పంచ్ గాడుదుల రాజశేఖర్, మాజీ సర్పంచ్ మారంపల్లి కొమ్మాలు, మాజీ ఉప సర్పంచ్ దొమ్మటి పురుషోత్తం, పాల్గొన్నారు.

## సమ్మక్క సారలమ్మలను దర్శించుకున్న సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి

**ప్రజాపక్షం/నెక్కొండ:**తెలంగాణ రాష్ట్ర కుంభమేళాగా పేరుగాంచిన మేడారం సమ్మక్క సారలమ్మ వనదేవతలను నర్సంపేట నియోజకవర్గ టిపిసిసి సభ్యులు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని, తెలంగాణ అభివృద్ధి చెందాలని ప్రార్థించారు. ఆయనతో పాటు నెక్కొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బక్కి అశోక్, ప్రధాన కార్యదర్శి కుసుమ చెన్నకేశవులు, జనగాం ప్రవీణ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ లావుడ్యా తిరుమల్, నర్సంపేట కోర్టు ఏజిపి బండి శివ, మార్కెట్ డైరెక్టర్ రావుల మహిపాల్‌రెడ్డి, వజ్రాల శేఖర్ రెడ్డి తదితరులు అమ్మవార్ల దర్శనంలో పాల్గొన్నారు. ఆదివాసీ సాంప్రదాయాలకు ప్రతీకంగా నిలిచిన మేడారం జాతర దేశంలోనే అతి పెద్ద గిరిజన జాతరగా గుర్తింపు పొందిందని, సమ్మక్క సారలమ్మల జాతర తెలంగాణ సాంస్కృతిక వైభవానికి అద్దం పడుతూ కోట్లాది భక్తుల విశ్వాసాలకు కేంద్ర బిందువుగా నిలుస్తోంది

## గ్రామాభివృద్ధికి నా సహకారం ఉంటుంది: ఎంపి కిరణ్‌కుమార్

**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** మండలంలోని బండ నాగారం గ్రామ సమగ్ర అభివృద్ధికి తన వంతు పూర్తి సహకారం అందిస్తానని భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్‌కుమార్ రెడ్డి హామీ ఇచ్చారు. శనివారం బండ నాగారం సర్పంచ్, కాంగ్రెస్ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు ఇజ్జగిరి రాములు, కొమ్మూరి ప్రతాపరెడ్డి, కొమ్మూరి ప్రశాంత్ రెడ్డిల ఆధ్వర్యంలో ఎంపీని మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామంలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనుల గురించి ఇజ్జగిరి రాములు ఎంపీకి వివరించారు. సానుకూలంగా స్పందించిన ఎంపీ గ్రామాభివృద్ధికి తన నిధుల నుంచి వెన్నుదన్నుగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా డీసీసీ అధ్యక్షులు లకావత్ ధన్వంతి, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, వార్డు సభ్యులు శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

**ప్రజాపక్షం/రఘునాథపల్లి:** పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని ఆంధ్ర తండాలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రతండా గ్రామానికి చెందిన మాలోతు సింహాద్రి (55) తనకున్న కొద్దిపాటి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇదే క్రమంలో పెండ్లి ఈడుకు వచ్చిన కూతురుకు రూ.20లక్షలు ఇచ్చి వివాహం చేశాడు. దీంతో పెండ్లికి తెచ్చిన అప్పును ఎలా చెల్లించేదని తీవ్ర మనస్థాపానికి గురై పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు, గ్రామస్థులు చికిత్స నిమిత్తం జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దూదిమెట్ల నరేష్ యాదవ్ తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

# వర్ధన్నపేట మున్సిపాలిటీలో గెలుపు కాంగ్రెస్‌దే

12వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను
భారీ మెజార్టీ గెలిపించాలి
ఎమ్మెల్యే నాగరాజు



**ప్రజాపక్షం/ వర్ధన్నపేట :** వర్ధన్నపేట టౌన్ పరిధిలోని 12 వార్డుల ముఖ్య నాయకులతో వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపిఎస్ అధికారి కెఆర్ నాగరాజు విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వర్ధన్నపేట పట్టణ అభివృద్ధి, కొనసాగుతున్న ప్రభుత్వ పనులు, ప్రజా సమస్యలు, అలాగే మున్సిపల్ ఎన్నికల్లో అనుసరించాల్సిన కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు మాట్లాడుతూ వర్ధన్నపేట నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. గత ప్రభుత్వాలు వర్ధన్నపేట పట్టణాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశాయని, ప్రజలకు అవసరమైన కనీస మౌలిక సదుపాయాల కల్పనలో కూడా విఫలమయ్యాయని తీవ్రంగా విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వర్ధన్నపేటలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా ప్రజల ఆరోగ్యం, విద్య, సాగునీరు, మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. వర్ధన్నపేట పట్టణంలో 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి ఏర్పాటు చేయడం ద్వారా పట్టణంతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయని, సబ్ జైలు నిర్మాణం వల్ల ప్రాంతానికి అవసరమైన పరిపాలనా సౌకర్యాలు మరింత బలోపేతం అవుతాయని, రూ.200 కోట్ల వ్యయంతో ఆధునిక సౌకర్యాలతో కూడిన ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేయడం ద్వారా ప్రభుత్వ విద్యకు కొత్త ఊపిరి లభిస్తుందని, పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని వర్ధన్నపేట, కోనారెడ్డి పేట చెరువు ఫీడర్ ఛానల్ మరమ్మతులు పూర్తయితే రైతులకు సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, సుమారు రూ.20 కోట్ల నిధులతో మున్సిపాలిటీ పరిధిలో రోడ్లు, డ్రైనేజీ, త్రాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం వంటి అభివృద్ధి పనులు విస్తృతంగా కొనసాగుతున్నాయని వివరించారు.ఈ అభివృద్ధి పనులన్నీ కేవలం నేటి అవసరాలను మాత్రమే కాకుండా వర్ధన్నపేట భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని చేపడుతున్నవేనని తెలిపారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలన్నదే కాంగ్రెస్ పార్టీ యొక్క ప్రధాన ఆశయమని స్పష్టం చేశారు.గత పాలకులు వర్ధన్నపేట పట్టణాన్ని కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూశారని, కానీ కాంగ్రెస్ పార్టీ మాత్రం ప్రజల కష్టాలు, అవసరాలను అర్థం చేసుకొని నిజాయితీగా పని చేస్తోందని అన్నారు. మాటలకే పరిమితం కాకుండా చేతల్లో అభివృద్ధిని చూపిస్తున్నది కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వమేనని ఎమ్మెల్యే నాగరాజు పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికలు వర్ధన్నపేట పట్టణ భవిష్యత్తును నిర్ణయించే కీలక ఎన్నికలని పేర్కొంటూ, అభివృద్ధి నిరంతరంగా కొనసాగాలంటే ప్రజలు మరోసారి కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలని కోరారు.

ప్రజల కోసం పని చేసే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పార్టీ శ్రేణులు, 12 వార్డుల నాయకులు, కార్యకర్తలు, పట్టణ ప్రజలను విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో మాజీ టిస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వరద రాజేశ్వర్ రావు, టిపిసిసి లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్ రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, ఐనవోలు ఆలయ కమిటీ చైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు చిటూరి రాజు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, మున్సిపల్ ఎన్నికల ఇన్‌చార్జీలు, 12 వార్డుల అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వనంలోకి ప్రవేశించిన సమ్మక్క, సారలమ్మ

**ప్రజాపక్షం / వేలేరు :** వేలేరు మండలంలోని పీచర,ఎర్రబెల్లి గ్రామాలలో మినిమేడారంగా పిలువబడే సమ్మక్క సారక్కలు గతనాలుగురోజులుగా గద్దెలపై కొలువుదీరిన వనదేవతల జాతర ఘనంగా జరుగగా చివరి రోజున శనివారం కోయ పూజారులచే పూజలు నిర్వహించి తిరిగి చిలుకల గుట్ట వనంలోకి ప్రవేశం చేయడం జరిగింది కార్యక్రమంలో పీచర ఆలయ చైర్మన్ గొల్లెన రమేష్,సర్పంచ్ మరిజె అనితనర్సింగారావు,వైస్‌చైర్మన్ సట్ల రవిందర్,ఎర్రబెల్లి ఆలయవ్యవస్థాపకులు కాలరుపుష్పలీలచినబాబు,తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయ కక్షలకు వేదికగా సమ్మక్క, సారలమ్మ జాతర

**ప్రజాపక్షం / వేలేరు :** వేలేరు మండలంలోని పీచరగ్రామశివారులోని సమ్మక్కసారక్క జాతర ఎంతో ప్రశస్తిగాంచినదిగా మండలం లోనేకాకుండా ఇతర జిల్లాలనుండి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి మొక్కులు సమర్పించు కొనగా భక్తులకు కోరిన కోరెలు తీర్చేకొంగు బంగారమై విరాజిల్లుతూ ప్రతిసంవత్సరం జాతర అంచెలు అంచెలుగా అభివృద్ధి చెందుతుండగా ఈనెల 28 వతేదీన సమ్మక్క సారక్క జాతర ప్రారంభంరోజే అదేగ్రామానికి చెందిన కొందరు బిఆర్ఎస్,కాంగ్రేస్ పార్టీలకుచెందిన నాయకులు పోలీసుల సాక్షిగా గొడవలకు దిగగా భక్తులకు అటంకంగా మారినవైనం తెలిసినప్పటికి శుక్రవారం జాతరలో మొక్కులు సమర్పించడానికి వచ్చిన జనగామ ఎంఎల్ఏ పల్ల రాజేశ్వర్‌రెడ్డి ఎదురుగానే బిఆర్ఎస్ పార్టీకి చెందిన కొందరు నాయకులు మాజీఎంఎల్ఏ రాజయ్య వర్గంగా,మరికొందరు వర్ధన్నపేట ఎంఎల్ఏ ఆరూరి రమేష్ వర్గాలుగా మారి బాహాబాహీకి దిగారు.ఇటీవలే ఆరూరి రమేష్ బిఆర్ఎస్ పార్టీలో చేరుతారనే విషయాన్నిగమనించిన నాయకులు హైదరాబాద్‌లో ఆరూరిని కలువడంతో రాజయ్య అనుచర వర్గం పల్ల ఎదుటే దూషణల పర్వాన్ని ప్రారంభించి ఒకరినొకరు నెట్టేసుకున్నారు.కాగా మండలంలో బిఆర్ఎస్ వర్గీయులుగా చీలగా పల్ల ఆగ్రహించగా శనివారం ఇరువర్గాలను కలిపి మాట్లాడే ప్రయత్నం చేశారనే చర్చజరుగుతున్నా బిఆర్ఎస్‌లో వర్గపోరు తగ్గేనా అనేఅనుమానాలు మండలప్రజలలో రేకెత్తుతున్నాయి.

## మేడారంలో సైనికుడిలా శ్రమించిన జర్నలిస్టులు

సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** చివరి దశకు చేరుకున్న మేడారం మహా జాతరను ప్రత్యక్షంగా దర్శించలేని భక్తులకు కూడా కళ్లకు కట్టినట్లుగా చూపించిన ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సేవలు అపూర్వమని సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ పేర్కొన్నారు. కోట్లాదిమంది భక్తుల ఆరాధనతో, సంప్రదాయ వైభవంతో నిర్వహించబడిన మేడారం జాతర విశేషాలను పత్రికలలో ఫోటోల రూపంలో విశదంగా ప్రచురిస్తూ, ప్రతి ఘట్టాన్ని ప్రజల మదిలో నిలిచేలా చూపించడంలో ప్రింట్ మీడియా కీలక పాత్ర పోషించిందన్నారు.అదేవిధంగా ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా జాతర ప్రారంభం నుంచి చివరి దశ వరకు జరిగిన అన్ని ఘట్టాలను ప్రత్యక్ష ప్రసారాలు, ప్రత్యేక కథనాలు, విశ్లేషణలతో ప్రజల ముందుకు తీసుకువచ్చిన విధానం అభినందనీయమని తెలిపారు. అర కొర వసతులతో చలిని సహితం లెక్క చేయకుండా విపరీత రద్దీ పరిస్థితులను లెక్కచేయకుండా అహర్నిశలు సైనికుల్లా శ్రమించిన జర్నలిస్ట్ మిత్రుల కృషి ప్రశంసార్హమని అన్నారు. మేడారం జాతర ఆధ్యాత్మిక విశిష్టతను, ప్రజల విశ్వాసాన్ని, ప్రభుత్వ ఏర్పాట్లను సమతుల్యంగా ప్రజలకు చేరవేయడంలో మీడియా చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రింట్ మీడియా యాజమాన్యానికి, ఎలక్ట్రానిక్ మీడియా అభిమానానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## ఓమౌజయా: ఏకోపాసన మహాధర్మం శ్రీచక్ర యజ్ఞం




**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** శ్రీశ్రీశ్రీ పరమ పూజ్య మహా ప్రేమావతార మూలాధి పరా స్వయంభూః సద్గురు పరబ్రహ్మ శ్రీ జైమహావిభోశ్రీః వారి దివ్యానుగ్రహముతో లోక కళ్యాణార్థం సర్వజనుల శ్రేయస్సుకై మాఘ మాస పౌర్ణమి సందర్భంగా వరంగల్ లో ఓమౌజయా: మహాలక్ష్మి మహాగురు శ్రీ చక్ర యజ్ఞాన్ని ఓమౌజయాః ఏకోపాసన మహా ధర్మం ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేయడం జరిగింది. స్వస్తిశ్రీ చాంద్రమానేన శ్రీ విశ్వావసు నామ సంవత్సర మాఘ మాస పౌర్ణమి వేడుకలు టి.టి.డి కళ్యాణ మండపం, పబ్లిక్ గార్డెన్ పక్కన, లష్కర్ బజార్, హనుమకొండలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమ వివరాలు ఉదయం 10.00 నుండి మధ్యాహ్నం 12.00 వరకు ఓమౌజయాః స్వయంభూః చైతన్య శక్తిపీఠం ర్యాలీ, సాయంత్రం 04.00 నుండి సాయంత్రం 05.30 వరకు శ్రీ ప్రభూ పల్లకి సేవ, సాయంత్రం 05.30 నుండి రాత్రి 07.00 వరకు మహాలక్ష్మీ మహాగురు శ్రీచక్ర యజ్ఞం కలశపూజ, పరనాగేంద్రుడికి ప్రత్యేక హారతులు, అభిషేకం కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. యజ్ఞానంతరం దివ్య ప్రసాదం, ఉచిత అన్నప్రసాద వితరణ ఏర్పాట్లు సాగుతున్నాయన్నారు. ఈ దైవ, ధర్మ కార్యక్రమంలో ప్రముఖులు, ప్రజలు అందరూ పాల్గొనాలని ఆహ్వానించారు.

## స్క్రూటినీ నిబంధనలను కచ్చితంగా పాటించాలి

**ప్రజాపక్షం/ నర్సంపేట :** స్క్రూటినీ అన్ని నిబంధనలను కచ్చితంగా పాటించాలని అధికారులకు ఎన్నికల సాధారణ పరిశీలకులు కిల్లు శివకుమార్ నాయుడు అన్నారు. మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా శనివారం నర్సంపేట మునిసిపాలిటీ కార్యాలయంలో నిర్వహిస్తున్న నామినేషన్ల స్క్రూటినీ ప్రక్రియను ఆయన పరిశీలించారు. అనంతరం నామినేషన్ల పరిశీలన ప్రక్రియలు ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరుగుతున్నాయా అనే అంశాలను అబ్జర్వర్ పరిశీలించారు. నామినేషన్ల స్క్రూటినీ సమయంలో పాటించాల్సిన విధివిధానాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. స్క్రూటిని అన్ని నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ వ్యవహరించాలని, అధికారులు బాధ్యతగా విధులు నిర్వహించాలని అబ్జర్వర్ సూచించారు. అలాగే, ఎన్నికల ప్రక్రియ మొత్తం ప్రశాంత వాతావరణంలో, స్వేచ్ఛాయుతంగా, న్యాయంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు సమర్థవంతంగా చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ భాస్కర్, జిల్లా నోడల్ అధికారి నర్సింహమూర్తి, ఎన్నికల అధికారులు, సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## రంగంపేట గుడిసె వాసులు నిరసన

**ప్రజా పక్షం/వరంగల్ టౌన్ :** నగరంలోని 11వ డివిజన్ పరిధిలోని భద్రకాళి దేవస్థానాన్ని అనుకోని ఉన్న చెరబండరాజు నగర్ గుడిసెల్లో గత 23 సంవత్సరాల క్రితం నుండి నివసిస్తున్న దళితులను,నేడు భద్రకాళీ మాడ వీధుల నిర్మాణాల పేరిట అన్యాయంగా ఎలాంటి ఆశ్రయం, జీవనోపాధి కల్పించకుండా అధికార కాంగ్రెస్ ప్రభుత్వం కూల్చి వేసే కుట్రలను తిప్పికొట్టాలని డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్ పార్టీ 5వ డివిజన్ అధ్యక్షుడు బొల్లెపెల్లి పున్నం చందర్ ఆధ్వర్యంలో కాలని వాసులనుకలుపుకొని, చెరబండరాజు నగర్ గుడిసెల్లో ఉన్న దళితుల ఆరాధ్య దైవమైన డా.బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి, గుడిసె వాసులకు న్యాయం జరగాలని మాల మహానాడు కుల సంఘ నాయకుల మద్దతు కూడా ప్రకటించి అన్ని దళిత వర్గాల ప్రజలు కదలి వచ్చి గుడిసె వాసులకు న్యాయం జరిగేంత వరకు అండగా నిలవాలని పిలుపునివ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో నాయకులు పండుగ సాగర్, మూల ప్రభాకర్, దాసరి సమ్మన్న, విశాల్, ప్రభాకర్, చెరబండరాజు నగర్ వాసులు మొదలైన పాల్గొన్నారు.

## పదవీవిరమణ అనంతరం కుటుంబ సభ్యులతో గడపండి

వరంగల్ అదనపు డిసిపి రవి

**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** పదవీ విరమణ అనంతరం పోలీస్ సిబ్బంది కుటుంబ సభ్యుల కోసం సమయం కేటాయించాలని అదనపు డిసిపి సూచించారు.వరంగల్ పోలీస్ కమిషనరేట్ విభాగంలో సుదీర్ఘకాలం విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన పోలీస్ అధికారుల మంగళవారం ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. పదవీ విరమణ పొందిన వారిలో సబ్ ఇన్‌స్పెక్టర్లు, బుచ్చిరెడ్డి, సంజీవరావు, ఆనందం, ఎ.ఆర్.ఎస్.ఐలు బీర్ దేవ్ వున్నారు. ఈ సందర్భంగా అదనపు డిసిపి మాట్లాడుతూ సుదీర్ఘ కాలం పాటు పోలీస్ శాఖకు సేవలందించి పదవీవిరమణ చేస్తున్న అధికారులు నేటి తరం పోలీసులకు ఆదర్శంగా నిలుస్తారని, పదవీ విరమణ అనంతరం పోలీస్ సిబ్బంది ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని, ప్రభుత్వం నుండి అందే డబ్బును భవిష్యత్తు అవసరాలకు భద్రపరుకోవాలని డిసిపి సూచించారు. కార్యక్రమంలో పోలీస్‌సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## వనంలోకి చేరిన సమ్మక్కతల్లి

**నడికూడ / ప్రజాపక్షం:** హనుమకొండ జిల్లా నడికూడ మండల పరిధిలోని కంఠాత్మకూర్, పులిగిల్ల గ్రామాల్లో గల సమ్మక్క సారలమ్మ జాతర అంగరంగ వైభవంగా జరిగింది. సారలమ్మ, సమ్మక్క తల్లిని పూజారులు గద్దెపై చేర్చారు. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవార్ల ప్రాంగణంలోకి శుక్రవారం భక్తులు అధిక సంఖ్యలో రావడంతో రెండు సంవత్సరాల పాప తప్పిపోవడంతో అక్కడే విధులు నిర్వహిస్తున్న దామెర పోలీస్ కానిస్టేబుల్ అమూల్య ఆ పాపను హక్కున చేర్చుకుని మైకు ద్వారా సమాచారం అందజేసి ఆ పాపను తల్లిదండ్రులకు సురక్షితంగా అందజేయగా వారు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. సమ్మక్కను పూజారులు డప్పు వైయిద్యాలతో వనఃప్రవేశం చేయించారు.

## మద్యపాన నిషేధ ఆమోద తీర్మానం



**ప్రజాపక్షం/నిజాంపేట్:**నిజాంపేట మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో మద్యపానాన్ని నిషేధిస్తూ, తీర్మానం చేసి స్థానిక ఎస్సై కి అందజేశారు. నిజాంపేట మండలం నస్కల్ గ్రామంలో గ్రామ సభ నిర్వహించి మద్యపాన నిషేధాన్ని తీర్మానం చేసి స్థానిక ఎస్ఐ రాజేష్ కి తీర్మాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామంలో ఎవరైనా బెల్ట్ షాపులు నడిపిస్తే, కఠిన చర్యలు తీసుకుంటామని సర్పంచ్ ఉప సర్పంచ్ హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంగించి అమ్మినవారికి 50 వేల రూపాయల జరినామా పట్టించిన వారికి పదివేలు రూపాయల నజరానా ప్రకటించారు. ఈ కార్యక్రమంలోపాలకవర్గ సభ్యులు బైండ్ల నవీన్, గ్రామస్తులు కొమ్మాట దేవరాజు, చల్మెడ మహేష్, కొమ్మట రాజు ఉన్నారు.

## స్వచ్ఛ గొల్లపల్లికి శ్రీకారం గ్రామ పరిశుభ్రతే లక్ష్యం

**ప్రజాపక్షం/ కొండాపూర్ :**గ్రామ పరిశుభ్రతే ప్రధాన లక్ష్యంగా స్వచ్ఛా గొల్లపల్లి కార్యక్రమానికి గొల్లపల్లి గ్రామ సర్పంచ్ గడీల శ్రీనివాస్ గౌడ్ శ్రీకారం చుట్టారు. కొండాపూర్ మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామాన్ని పరిశుభ్రంగా ఆరోగ్యకరంగా తీర్చిదిద్దాలనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని ఈ రోజు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ మన ఊరి అభివృద్ధి మన చేతుల్లోనే ఉంది ఒక్క రోజు సమయాన్ని మన ఊరి కోసం కేటాయించి గ్రామాన్ని స్వచ్ఛా గ్రామంగా మార్చుకుందామని, ఇందుకోసం అందరం నేడు ఈకార్యక్రమంలో పాల్గొని భాగస్వాములవుదామని పిలుపు నిచ్చారు. గ్రామస్తులు ,యువత, మహిళలు ఈ కార్యక్రమంలో చురుకుగా గ్రామ పరిశుభ్రతకు సహకరించాలని ఆయన కోరారు.

## మెను ప్రకారం భోజనాన్ని అందించాలి..

కలెక్టర్ కె.హైమావతి



**ప్రజాపక్షం/బెజ్జంకి:**విద్యార్థులకు మెను ప్రకారం నాణ్యమైనా భోజనాన్ని అందించాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి అన్నారు.శనివారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ అకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు.ఈ సంధర్భంగా విద్యార్థులకు మెను ప్రకారం భోజనాన్ని అందించలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఎస్వోపై చర్యలు తీసుకోవాలని డిఈవోకు ఫోన్ ద్వారా ఆదేశించారు.పిల్లల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.అనంతరం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి అటెండెన్స్,ఓపి రిజిస్టర్‌లను పరిశీలించారు.రాత్రి సమయంలో వచ్చే రోగులకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యాన్ని అందించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు.

## సూపర్‌వైజర్లు బిఎల్‌ఓలు సమర్థవంతంగా పని చేయాలి

జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



**ప్రజాపక్షం/సంగారెడ్డి :**సూపర్వైజర్లు బిఎల్ఓలు క్షేత్ర స్థాయిలో సమర్థవంతంగా పని చేయాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. ఓటర్ల జాబితా సవరణలో భాగంగా చేట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను నిర్ణీత గడువులో వేగవంతంగా తప్పిదాలకు తావు లేకుండా పూర్తి చేసేందుకు సూపర్వైజర్లు బిఎల్ఓలు క్షేత్ర స్థాయిలో సమర్థవంతంగా పనిచేసేలా అన్ని చర్యలు చేపట్టామని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. శనివారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ఎన్నికల అధికారులతో కలిసి రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సదర్శన్ రెడ్డి వీడియో కాన్సరెన్స్ ద్వారా అన్నిజిల్లాల కలెక్టర్లు ఎన్నికల అధికారులతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణకు చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఓటరు మ్యాపింగ్‌లో ఏలాంటి తప్పిదాలకు అవకాశం లేకుండా ఈఆర్ఓలు సమగ్ర పర్యవేక్షణ చేపట్టి ప్రక్రియ సకాలంలో పూర్తియ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వీడియో కాన్సరెన్స్‌లో పాల్గొన జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియ ను ఏలాంటి పొరపాట్లకు తావు లేకుండ నిర్ణీత గడువులో పూర్తి చేస్తామని తెలిపారు. బిఎల్‌లోలు ,సూపర్వైజర్లకు స్పష్టమైన లక్ష్యాలు కేటాయించి క్షేత్ర స్థాయిలో ప్రక్రియ వేగంగా సాగేలా పర్యవేక్షణను మరింత పట్టిష్టం చేశామని చెప్పారు. ఈ వీడియో కాన్వరెన్స్‌లో జిల్లా నుండి అదనపు కలెక్టర్లు మాధురి, పాండు, ఆర్డిఓ రాజేందర్ ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**యదావిధిగా ప్రజావాణి కొనసాగింపు**

ప్రజావాణి కార్యక్రమం యదావిధిగా సోమవారం నాడు ఫిబ్రవరి 2వ తేదిన నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య శనివారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

## వెంకటేశ్వర స్వామి చల్లని చూపుతో సుఖ సంతోషాలతో ఉండాలి

**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్:** శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని,స్వామి దయతో ఆయన చల్లని చూపు ప్రజలందరిపై ఉండి సుఖ సంతోషాలతో జీవించాలని ప్రముఖ వ్యాపారవేత్త వంగ రాజేశ్వర్‌రెడ్డి ఆకాంక్షించారు. సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలం కోనాయిపల్లిలో జరుగుతున్న శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు శనివారం వంగ రాజేశ్వర్‌రెడ్డి వెళ్లగా వారికి ఆలయ కమిటి సభ్యులు,అర్చకులు,గ్రామప్రజలు, భక్తులు ఘనంగా స్వాగతం పలికారు. శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో నిర్వహించిన శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన బ్రహ్మోత్సవాల నిర్వహణకు 25వేల రూపాయలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటి సభ్యులు వంగ రాజేశ్వర్‌రెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి దువ్వల మల్లయ్య,ఆలయ కమిటి చైర్మన్ నిమ్మ విష్ణువర్థన్‌రెడ్డి,ప్రదీప్‌రెడ్డి,సిద్దన్నపేట సర్పంచ్ సంగు పురేందర్,వెంకటేశం,రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గోన్నారు.

**హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న శేఖర్‌ను పరామర్శించిన రాజేశ్వర్‌రెడ్డి**

సిద్దిపేట పట్టణంలోని పీపుల్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న కొండపాక గ్రామానికి చెందిన శేఖర్ యాదవ్‌ను వంగ రాజేశ్వర్‌రెడ్డి శనివారం పరామార్శించారు. అలాగే సిద్దిపేట పట్టణానికి చెందిన బుచ్చిరెడ్డి ఆనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకొన్న వంగ రాజేశ్వర్‌రెడ్డి వారి నివాసానికి వెళ్లి ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకొని ధైర్యంగా ఉండాలని తెలిపారు. వారి ఆరోగ్య స్థితిని వైద్యులను అడిగి తెలుసుకొని,ఇరువురు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యంగా ఉండాలని తెలిపారు.



## వేయేళ్ల చరత్ర గల గుంతపల్లి శివాలయాన్ని కాపాడుకుందాం

**ప్రజాపక్షం /కొండాపూర్ :**సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం గుంతపల్లి కి వేయ్యేళ్ల చరిత్ర ఉందని పురావాస్తు పరిశోదకుడు ప్లేచ్ ఇండియా పౌండేషన్ సీఈఓ డా ఈమని శివనాగిరెడ్డి అన్నారు. గుంతపల్లి సర్పంచ్ పడమటి రెడ్డి ఆహ్వానం మేరకు ఆయన గ్రామ శివారులోని చారిత్రాక శివాలయాన్ని అలాగే గ్రామం మధ్యలో ఉన్న పురాతన బురుజును పరిశీలించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ శివాలయ ద్వార శాఖలు వాటిపై ఉన్న పూర్ణకలశ చిహ్నాలు ,గర్భాయలయం లోని నల్ల శాసనపు రాతిలో నునువుగా చెక్కిన సౌనష్ట్నం బ్రహ్మ సూత్రం (లక్ష్మణోద్దారణ రేఖ,) కలిగిన శివలింగం కళ్యాణ ,చాళుక్య, వాస్తు శైలికి అద్దం పడుతున్నాయని అన్నారు. ఆ ఆలయం శాలివాహన శకం 1076 నుంచి 1125 వరకు పరిపాలించిన కళ్యాణ చాళ్యక చక్రవర్తి త్రిభువన మల్ల బిరుదాంకితుడైన ఆరో విక్రమాదిత్యుని కాలంలో నిర్మించి ఉండవచ్చని తెలిపారు. అప్పట్లో పటాన్ చెరు తాత్కాలిక రాజదానిగా (నేలవీడు)ఉండడం వల్ల ఈ ప్రాంతంలో శివాలయాల నిర్మాణం విస్తృతంగా జరిగి



ఉంటుందని వివరించారు. వేయ్యేళ్ల చరిత్ర గల శివాలయ ద్వార శాఖలపై ఉన్న రంగులను తొలగించి శిథిలావస్థలో ఉన్న శివలింగాన్ని సంరక్షించాల్సిన అవసరం ఉందని అలాగే గ్రామం మద్యల సుమారు 150 ఏళ్ల క్రితం నిర్మించిన గుండ్రటి బురుజును కూడ కాపాడుకోవాలని ఆయన గ్రామస్థులకు సూచించారు. చారిత్రాక కట్టడాల సంరక్షణ ద్వారా గ్రామ వైభవం ,సాంస్కృతిక వారసత్వం భవిష్యత్ తరలాకు నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పడమటి అనంత్‌రెడ్డి ,గ్రామ పెద్దలు యువకులున్నారు.

## బిఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రచారం

**ప్రజాపక్షం/సంగారెడ్డి:**మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్‌ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పిలుపు నిచ్చారు ఈ సందర్భంగా సంగారెడ్డి పట్టణంలోని 32,33 వార్డుల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా గడప ,గడపకు ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హమీల బాకి కార్డులను పంపిణి చేస్తూ ఇప్పటి వరకు అమలుకాని హామిలను ప్రజలకు గుర్తు చేశారు. కాంగ్రెస్ హామీలు అమలుకావాలంటే కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ రాజనర్సు , మాజీ సీడిసీ చైర్మేన్ కాసాల బుచ్చిరెడ్డి, అభ్యర్థులు నాయికోటి నవీన్, ,గోవర్దన్ నాయక్, వా ర్డు ప్రజలు నాయకులు ,కార్యకర్తలు పెద్ద సంఖ్యంలో పాల్గొన్నారు.

## వర్గల్ క్షేత్రంలో... వైభవంగా శని త్రయోదశి మహోత్సవం

**ప్రజాపక్షం/గజ్వేల్:**తెలంగాణ జిల్లాల్లో సుప్రసిద్ద పుణ్యక్షేత్రంగా వెలుగోందుతున్న వర్గల్ శ్రీ విద్యాధరి క్షేత్రంలో శనివారం శని త్రయోదశి మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ బ్రహ్మశ్రీ చంద్రశేఖర శర్మ సిద్ధాంతి నేతృత్వంలో వేద పండితులు 35వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం సిద్ధాంతి చంద్రశేఖర శర్మ ప్రసంగిస్తూ శని దేవుడి ప్రసన్నం చేసుకుంటే సకల శుభాలు కలుగుతాయని, ఆర్థిక, ఆరోగ్య సమస్యలు తొలగుతాయని స్పష్టం చేశారు. శని దోష నివారణ నిమిత్తం స్వామివారికి తైలాభిషేకంతో పాటు నల్లటి నువ్వులు, నల్ల వస్త్రం అర్పించడం ద్వారా అష్టమ శని దోషం నుండి ఉపశమనం పొందడానికి శని త్రయోదశి అత్యంత పవిత్రమైనదని తెలిపారు. లోక కళ్యాణార్థమై నిర్వహించిన శని త్రయోదశి మహోత్సవంలో వెయ్యికి పైగా అభిషేకాలు జరగగా, ఆలయ కమిటీ ప్రత్యేక కృషి ఫలితంగా శ్రీ వసంత పంచమి వేడుకలను వైభవంగా జరుపుకున్నట్లు సిద్ధాంతి చంద్రశేఖర శర్మ తెలిపారు. ముఖ్యంగా వార్షికోత్సవ సంబరాల సందర్భంగా ఆలయ సముదాయాన్ని నిర్వాహకులు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దగా, ఈ మహోత్సవాల్లో పాల్గొన్న భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలతో పాటు మహాప్రసాదం అందజేశారు.

## ఆడపిల్లల తల్లిదద్రుల పేరిట ఫిక్సిడ్ బాండ్ అందజేస్తాం..

**ప్రజాపక్షం/శివ్వంపేట :** శివ్వంపేటలో పుట్టిన ప్రతి ఆడపిల్లకు ఫిక్సిడ్ డిపాజిట్ బాండ్‌లను తప్పకుండా అందజేస్తామని మాజీ జడ్పీటీసీ పబ్బమహేశ్‌గుప్తా అన్నారు. గ్రామపంచాయతీ ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు ఇటీవలే శివ్వంపేట గ్రామానికి చెందిన కర్రె నవీన్, కర్రె షాలిని దంపతుల కూతురు బేబి కర్ర షైని పేరిట ఇండియన్ బ్యాంకులో మాజీ జడ్పీటీసీ పబ్బమహేశ్‌గుప్తా సొంతంగా చేసిన రూ. 15వేల ఫిక్సిడ్ డిపాజిట్ బాండ్‌ను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులమతాలకు సంబంధం లేకుండా రాజకీయ పార్టీలకు అతీతంగా శివ్వంపేటలో పుట్టబోయే ప్రతీ ఆడపిల్లల పేరిట తల్లిదండ్రులకు కొంత ఆర్థికంగా భరోసా కల్పించడం కోసం బ్యాంకు ఫిక్సిడ్ డిపాజిట్ బాండ్‌లను అందించి తీరుతామని ఆయన అన్నారు. అనంతరం మాజీ జడ్పీటీసీ మహేశ్‌గుప్తాకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాజిపేట వెంకటేశ్వర్, ఉపసర్పంచ్ ఇసుగారి మల్లేశ్, పెద్దగొట్టిముక్ల సర్పంచ్ నవీన్, గ్రామకమిటి అధ్యక్షులు లక్ష్మి నర్సయ్య, నాయకులు రామాగౌడ్, కొండల్, పోచాగౌడ్, విక్రం, శ్రీనివాస్‌గౌడ్, దొడ్ల అశోక్, పైనం యాదగిరి, జంగం నగేశ్, సురేష్, పత్రాల దేవేందర్, త్రినేష్‌గౌడ్, గుల్లయ్యగారి నాగరాజు, జోగని నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## నాడు ప్రాణమిత్రులు... నేడు ప్రత్యర్థులు

**ప్రజాపక్షం/రామాయంపేట:**నాడు ప్రాణమిత్రులుగా ఉన్నవారు నేడు రాజకీయ చదరంగంలో ప్రత్యర్థులుగా మారారు. రాజకీయాల్లో శాశ్వత మిత్రులు..శాశ్వత శత్రువులు ఉండరు అన్నమాట రామాయంపేటలో మరోసారి నిజమవుతుంది. నిన్నటి వరకు ఒకే వేదికపై కలిసి నినదించిన నేతలు ఒకే పార్టీ జెండా కింద పనిచేసిన ప్రాణమిత్రులు నేడు మున్సిపల్ ఎన్నికల వేళ ప్రత్యర్థులుగా మారి రాజకీయ సమరంలో ఎదురెదురుగా తలపడుతున్నారు. మున్సిపల్ ఎన్నికలకు ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేసి నామినేషన్ల ప్రక్రియను కూడా ముగించింది. ఇక ఎన్నికలే మిగిలాయి. టికెట్ల పంపిణీ, అధిష్టాన నిర్ణయాలు, వ్యక్తిగత ఆశలు..ఆకాంక్షలు కలిసి స్నేహబందాలను చెరిపేస్తున్నాయి. ఒకప్పుడు అన్నా..తమ్ముడు అని మాట్లాడుకున్న వారే నేడు ఒకరిపై ఒకరు విమర్శలు ఎక్కుపెడుతున్నారు. రామాయంపేట పట్టణంలో ఏళ్ల తరబడి కాంగ్రెస్‌లో పనిచేసిన మాజీ టీపీసీసీ సభ్యులు చౌదరి సుప్రబాత్‌రావుకు కాంగ్రెస్ అధిష్టానం టికెట్ నిరాకరించడంతో బిఆర్ఎస్ గూటికి చేరి ఆపార్టీ ఇచ్చిన హామీ మేరకు తన కుమార్తె చౌదరి చరితను 5వ వార్డులో పోటీకి దింపారు. బ్లాక్ కాంగ్రేస్ అద్యక్షులు ఏసుగారి రమేష్‌రెడ్డి సైతం కాంగ్రేస్ బిఫాంతో తన బార్య పుష్పలతను 5వ వార్డులోనే పోటీలో నిలిపారు. బిఆర్ఎస్ అవిర్బావం నుండి పనిచేస్తున్న బసన్నపల్లి మల్లేశం యాదవ్, దేవుని రవిలు 9వ వార్డులో ఒకరిపై ఒకరు పోటీకి సై అంటున్నారు. ఎవరూ కూడా తగ్గకపోవడంతో పై నలుగురు రంగంలో ఉంటున్నట్లు సమాచారం. ఏది ఏమైనా మున్సిపల్ ఎన్నికలు మంచి స్నేహితులను శత్రువులుగా మార్చాయని చెప్పవచ్చు.

# కుల వివక్ష లేకుండా గౌరవప్రదంగా జీవించాలి



**ప్రజాపక్షం/పాపన్నపేట:**కుల వివక్ష లేకుండా గౌరవప్రదంగా జీవించాలని, ప్రజలందరికీ సమాన హక్కులు ఉంటాయని స్థానిక ఎస్సై సార శ్రీనివాస్ గౌడ్ హాస్టల్ వార్డెన్ మహేష్ అన్నారు. శనివారం మల్లంపేటలో గ్రామ పంచాయతీ భవనంలో పౌర హక్కుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజలందరికీ సమాన హక్కులు ఉంటాయన్నారు. సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ నుంచి వచ్చే స్కీన్ ల గురించి వారు వివరిస్తూ వాటిని సద్వినియం చేసుకోవాలని వారు కోరారు. ఆర్ఐ స్వామి, అధికారులు రాజశేఖర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యలు పరిష్కరించడానికి పల్లె బాట




**ప్రజాపక్షం/నర్సాపూర్:**నర్సాపూర్ మండలం అచ్చంపేట గ్రామంలో ప్రజాబాట కార్యక్రమం నిర్వహించిన సర్పంచ్ నీరుడి తుల్లమ్మ, బిక్షపతి ఆధ్వర్యంలో గ్రామంలో ని ప్రతి వార్డు లో తిరుగుతూ సమస్యలు విద్యుత్ అధికారులు ఏడి రమణారెడ్డి ఏయ్ రమణ మూర్తి. తెలుసుకోవడం జరిగింది. గ్రామంలో ఉన్న ఎల్టి లైన్ తొలగించాలని గ్రామస్తుల కోరిక మేరకు అదేవిధంగా కొత్త కార్మికు విద్యుత్ స్తంభాలు పునరు ద్ధరిస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమం లో ఉప సర్పంచ్ నవీన్, లైన్ ఇన్స్పెక్టర్ ఉస్మాన్, వార్డు సభ్యులు ఆంజనేయులు కృష్ణ ప్రవీణ్, లైన్మెన్ రాజ్ కుమార్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు డీలర్లకు బుకింగ్ యాప్ పైన అవగాహన

**ప్రజాపక్షం/నర్సాపూర్:**నర్సాపూర్ పట్టణం లోని ఎరువుల దుకాణాలలో రైతులకు డీలర్లకు శనివారం యూరియా బుకింగ్ యాప్ పైన వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ మండల అధికారి దీపిక మాట్లాడుతూ ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ డౌన్లోడ్ చేసుకునే విధానం రైతులు యాప్ లో యూరియా బుకింగ్ చేసుకునే విధానంపై అవగాహన కల్పించడం జరిగింది అన్నారు. జిల్లాలో ఈ దుకాణంలో అయినా యూరియాను కొనుగోలు చేయవచ్చని బుక్ చేసుకున్న 20 గంటల్లోగా యూరియా అమ్మి ప్రతి డీలర్ ఈ యాప్ ద్వారా మాత్రమే అమ్మకాలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు దుర్గాప్రసాద్, రుతు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# వార్డు సభ్యులను ఇబ్బందులకు గురిచేస్తున్న సర్పంచ్ భర్త



**ప్రజాపక్షం/శివ్వంపేట :** అనేక రకాలుగా సర్పంచ్ సమతావేణుగోపాల్‌రెడ్డి భర్త ఇబ్బందులకు గురిచేస్తున్నాడని గ్రామపంచాయతీ ముందు వార్డుసభ్యులు ఆందోళన చేపట్టిన ఘటన మండల పరిధిలోని పాందండ గ్రామంలో చోటుచేసుకుంది. ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ తరుపున మెజారిటి వార్డుసభ్యులు గెలుపొంది ఉపసర్పంచ్‌గా నాగనొల్ల ఆంజనేయులను ఎన్నుకోవడం జరిగింది. సర్పంచ్‌గా కాంగ్రెస్ పార్టీ తరుపున నాయిని సమతా వేణుగోపాల్‌రెడ్డి గెలుపొందడం జరిగింది. 8వార్డుసభ్యులకు గాను కాంగ్రెస్ 3, బీఆర్ఎస్ 5వార్డులు గెలుపొంది ఉపసర్పంచ్ స్థానాన్ని బీఆర్ఎస్ కైవసం చేసుకోగా మూడు స్థానాలతో సరిపెట్టుకొని సర్పంచ్ స్థానాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకుంది. ఇదంతా బాగానే ఉన్నా గాని గ్రామపంచాయతీ పాలకవర్గం సభ్యుల పదవి ప్రమాణస్వీకారం రోజున సర్పంచ్, ఉపసర్పంచ్ ఇరువురికి గతంలో మాదిరిగానే గ్రామంపాచతీలో కుర్చీలు ఒకరి పక్కన ఒకరికి ఉండేదని, ప్రమాణస్వీకారం తరువాత సర్పంచ్ సమతా వేణుగోపాల్‌రెడ్డి భర్త వేణుగోపాల్‌రెడ్డి మాకు వేసిన కుర్చీలను సర్పంచ్ చాంబర్ ముందు నుంచి తీయించారని వార్డుసభ్యులు ఆరోపించారు. కుర్చీలు లేవు, మీ సొంతంగా కుర్చీలు తెచ్చుకోండని గ్రామపంచాయతీ సిబ్బందితో తెప్పించడంతో కుర్చీలను మేమే సొంతంగా తెచ్చుకున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మేము తెచ్చుకున్న విల్‌చైర్లు కావడంతో ఓర్వలేని సర్పంచ్ భర్త వేణుగోపాల్‌రెడ్డి అధికారం చేతిలోఉందని మమ్మల్ని కించపరిచే విధంగా వ్యవహరిస్తూ కుర్చీలనే అక్కడి నుంచి తీసివేయించి జీపీలోని స్టోర్‌రూములో వేయించరని ఆరోపించారు. కుర్చీలు తెచ్చుకున్నారా ఇంకా నయం బెడ్ మంచాలు తెచ్చుకోవద్దా అంటూ మహిళా వార్డుసభ్యులు నీరుడి శ్రీకాంత్, ఎర్ర శ్రీనివాస్ ఆందోళన వ్యక్తం చేశారు. కుర్చీలు లేకుంటే నేలమీద కూర్చోవాలా అధికారులే తేల్చాలని కుర్చీల విషయంలో మండల అధికారులు చర్యలు తీసుకోకుంటే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నాగనోళ్ల ఆంజనేయులు, దుబ్బ బాలమణిసత్యనారాయణ, ఎర్ర శ్రీనివాస్, నీరుడి శ్రీకాంత్, కుమ్మరి యాదమ్మగౌరయ్య తదితరులు పాల్గొన్నారు.

# బాలలను కార్మికులుగా పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు



**ప్రజాపక్షం/సంగారెడ్డి :**బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యంగా గడిచిన నెల రోజులుగా వివిద శాఖల అధికారులు ,సిబ్బ ంది సమన్వయంతో చేట్టిన ప్రత్యేక కార్యక్రమమే ఆపరేషన్ స్మైల్ XII అని జిల్లా ఎస్పీ పరితోష్ ఫంకజ్ తెలిపారు. సమాజాన్ని పట్టిపీడిస్తున్న సమస్యలలో బాల కార్మిక వ్యవస్థ ఒకట ని అన్నారు. 5 నుండి 14 సంవత్సరాల లోపు వయస్సు గ ల పిల్లలు కార్మికులుగా పనిచేస్తే వారిని బాల కార్మికులుగా పరిగణిస్తారని బాలలను కార్మికులుగా నియమించడం వా రి ప్రాథమిక హక్కుకు భంగం కలిగించినట్లేనని అన్నారు. వ్యవసాయం, గనులు, తయారీనిర్మాణ రంగం ,పరిశ్రమ లు ,కర్మాగారాలు, హోటళ్లు , రైల్వే స్టేషన్లు ,బస్ స్టేషన్లు, భిక్షాటన తదితర రంగాలలో బాలలు కార్మికులుగా పనిచేస్తున్నారని బాలలు కార్మికులుగా కొనసాగడం వల్ల వారు భవిష్యత్తులో ఉన్నతమైన జీవితం గడపే అవకాశాలు కో ల్పోతారని సరైన విద్య లేకోవడం వలన ఉపాది అవకాశా లు దూరమవుతాయని అన్నారు. నేటి పోటీ ప్రపంచంలో అన్ని రంగాలలో రాణించాలంటే విద్యతో పాటు సరైన పో షకాహారం ,ఆటలలో చురుకుదనం ,తోటి విద్యార్థులతో పోటిపడి సామర్థ్యం అవసరమని అన్నారు. బాల కార్మికులుగా మారడం వలన సరైన మార్గదర్శనం, నైపుణ్యాభివృద్ధి ,ఆర్థిక సహకారం లేక పలువురు బాలలు నేరాలవైపు మళ్లి ప్ర మాదం ఉందని తెలిపారు. నేటి బాలలే రేపటి పౌరులు ,చిన్నారులే దేశ ప్రగతకి పునాది అని అభివృద్ధి లో పరుగు లు పెడుతున్న ఈ హైటెక్ యుగంలో కూడా బాల కార్మిక బాల కార్మిక వ్యవస్థ చిన్నారుల బాల్యాన్ని నాశనం చేస్తోందని అన్నారు. బాల కార్మికులు లేని ఆరోగ్యవంతమైన పిల్లలతో కూడిన దేశమే అభివృద్ధి లో ముందుటుందని అ న్నారు. బాల కార్మిక వ్యవస్థకు ప్రధాన కారణాలుగా పేదరికం, నిరక్షరాస్యత ,తక్కువ ఆదాయం , కనీస అవసరా లు,తీర్చిలేని పరిస్థితుల్లో అనేక కుటుంబాలు తమ పిల్లలను పనుల్లోకి నెట్టివేస్తున్నాయని చిన్నారులు చిన్న చిన్న చేతుల తో బతుకుబండిని లాగుతూ అనారోగ్యాలకు గురవుతున్నా రు. బాల కార్మిక వ్యవస్థ అనే కబంద హస్తాల నుంచి చిన్నారులను విముక్తి చేయాలనే లక్ష్యంతో 2014 నుండి ప్రతి సంవత్సరం జనవరి నెలలో ఆపరేషన్ స్మైల్ జులై నెలలో ఆపరేషన్ ముస్కాన్, కార్యాక్రమాలను పోలీస్ శాఖ పకడ్బందీగా అమలు చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమాల ద్వారా బాలలను పనిస్థలాల నుంచి రక్షించి పాఠశాలలో చేర్పడం తప్పిపోయిన పిల్లలను తల్లిదండ్రులు చెంతకు చేర్చుతూ బాదిత చిన్నారులకు అండగా నిలుస్తున్నామని పేర్కొన్నారు. ఎవరైన బాల కార్మికులు కనిపించినా ,ఎక్కడైన బాలలుపనిచేస్తున్నట్లు సమాచారం ఉన్నా చైల్డ్ లైన్ టోల్ ప్రీ నెంబరు , 1098 అత్యవసర నెంబర్ 112 కు పోన్ చేసి పిర్యాదు చేయవచ్చని ప్రజలను కోరారు. 18 సంవత్సరాల లోపు వయస్సు గల పిల్లను వెట్టిచాకిరి గురి చేయడం బలవంతం బిక్షాటన చేయించడం పశువులకు కాపరులుగా ,కిరాణా దుకాణాలు, మెకానిక్ షాపులు, హోటళ్లు ,ఇటుక బట్టీలు, దితర ప్రదేశాల్లో పని చేయించడం చట్టరీత్య నేరమని తెలిపారు. ఈ విదమైన చర్యలకు పాల్పడిన వారిపై కఠిన క్రిమినల్ కేసులు నమోదు చేయబడతాయిని హెచ్చరించారు. ఈ సంవత్సరం ఆపరేషన్ స్మైల్ XIIలో భాగంగా బాల కార్మికులను పనిలో పెట్టుకుని యాజమానులపూ 93 కేసులు, నమోదు చేసి ,122 మంది బాలలు ,11 మంది బాలికలు, మొత్తం 133 మంది బాల కార్మికులను రక్షించి విముక్తి కల్పించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన వివిధ శాఖలలకు చెందిన అధికారి సిబ్బందిని జిల్లా ఎస్పీ హృదయపూర్వకంగా అభినందించారు.

# ప్రచారం మొదలు పెట్టిన కాంగ్రెస్, బిఆర్ఎస్ ఎన్నికల ప్రచారం

**ప్రజాపక్షం/హుస్నాబాద్:**హుస్నాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో విడ్రాలు కాక ముందే పట్ణంలో కాంగ్రేస్ మరియు భారతరాష్ట్ర సమితి ఎన్నికల పార్టీలు ఎన్నికల ప్రచారం మొదలు పెట్టాయి. పట్టణంలో కాంగ్రె మున్సిపల్ చైర్మెన్ అభ్యర్థి కేడం లింగమూర్తి తన 17 వార్డులో పార్టీ కార్యకర్తలతో కలిపి శనివారం ఇంటింట ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. గత అసెంబ్లి ఎన్నికల్లో కాంగ్రేస్ పార్టీలో సీనియర్ నాయకునిగా పొన్నం ప్రభాకర్ గెలుపుకు ప్రధాన పాత్ర పోశించారు. పట్టణంలో అన్ని వర్గాల తో సన్నిహిత సంబందాలు కలిగిన వ్యక్తిగా పరిపాలలో మంచి పట్టు ఉన్న నాయకునిగా గతంలో సర్పంచుగా, కాంగ్రేస్ ప్రభుత్వంలో సిద్దిపేట జిల్లా గ్రంధాలయల చైర్మెన్‌గా, స్థానిక ఎమ్యెల్యే మంత్రి పొన్నం ప్రభాకర్ అండదండలు కేడం లింగమూర్తికి ఉండటం వల్ల ప్రజలు లింగమూర్తివైపు మొగ్గు చూపుతున్నారు. బిఅర్ ఎస్ పార్టీ నుండి 20 వార్డు, 18 వార్డుల 10వార్డుల నుండి మేకల వికాస్‌యాదవ్, వాల సుప్రజానవీన్ బిఅర్ ఎస్ పార్టీ నుండి మున్సిపల్ చైర్మెన్ అభ్యర్థిగా కొంకట నళిని రవిందర్ రేసులో ఉన్నారు. గతంలో కౌన్సిలరుగా అను భవం ఉన్న వ్యక్తులు మాజీ ఎమ్యెల్యే సతీస్ బాబు నుండి అండదండలు ఉన్నాయి.

# పర్యావరణ పరిరక్షణలో... జంతుజాల సంరక్షణ కీలకం



**ప్రజాపక్షం/గజ్వేల్:**పర్యావరణ పరిరక్షణలో వన్యప్రాణులు, జంతు జాల సంరక్షణ అత్యంత కీలకమని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ రమేష్ బాబు పేర్కొన్నారు. జంతు సంక్షేమ పక్షౌత్సవాల సందర్భంగా శనివారం గజ్వేల్ పట్టణంలోని మోడల్ స్కూల్, వివిధ పాఠశాలలు, కళాశాలల్లో జంతు సంరక్షణ, రెబీస్ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రాథమిక స్థాయి నుండి విద్యార్థులకు అవగాహన కల్పిస్తే చక్కటి ఫలితాలు వస్తాయనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టినట్లు తెలిపారు. ముఖ్యంగా జంతువులు, వన్యప్రాణులు, వీధి జంతువుల హక్కులు కాపాడే క్రమంలో వాటిపట్ల దయ, ప్రేమ భావం, మానవత్వం కలిగి ఉండాలని సూచించారు. అంతేగాకుండా వాటిని హింసించకపోవడంతో పాటు ఆరోగ్య పరిరక్షణ, స్వచ్ఛమైన నీరు, సరైన ఆహారం అందించడం పర్యావరణ పరిరక్షణలో భాగమని స్పష్టం చేశారు. మానవుల ఆలోచనల్లో మార్పు కోసం విద్యార్థి దశ ఎంతో కీలకమని, అలాగే అంతరించిపోతున్న వన్యప్రాణులు, జంతుజాల సంరక్షణ ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. విద్యార్థుల్లో మానవత్వాన్ని పెంపొందించే దిశగా అవగాహన కల్పిస్తే చక్కటి సమాజ నిర్మాణం సాధ్యపడుతుందని, అందుకు భిన్నంగా విద్యార్థుల ఆలోచనలు చెడితే జీవితమంతా అంధకారమే అవుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారులు డాక్టర్ సరోత్తమ్, డాక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# నస్కల్ ఎంఎంపిఎస్ స్కూల్ విద్యార్థుల విజ్ఞాన విహారయాత్ర



**ప్రజాపక్షం/నిజాంపేట్:**నిజాంపేట మండలంలోని నస్కల్ ఎంపీపీఎస్ పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు విజ్ఞాన విహార యాత్రకు వెళ్లి పలు చారిత్రక కట్టడాలపై ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు సాగరిక మాట్లాడుతూ, విద్యార్థులకు వివిధ చారిత్రాత్మక కట్టడాలు వాటి విశ్లేషణల గూర్చి అవగాహన కల్పించడానికి విజ్ఞాన విహారయాత్రగా తీసుకు వెళ్లినట్లు తెలిపారు. విజ్ఞాన విహారయాత్రలో భాగంగా జూ పార్క్, సాలార్జంగ్ మ్యూజియం, బిర్లా మందిర్, అమరవీరుల స్తూపం, సచివాలయం, హైకోర్టు, ట్యాంక్ బండ్ లాంటి వాటిని చూపించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మన్మథ, జాకియా, సుమలత, శ్రీనివాస్, ఎల్లం, శేఖర్, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఇందూర్‌లో ఉత్సహంగా డిప్లమా ఫ్రెషర్స్& ఫేర్వెల్ డే...

**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్:** సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఇందూర్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం డిప్లమా ఫ్రెషర్స్&ఫేర్వెల్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందూర్ కళాశాలలో మొదటి సంవత్సరంలోకి అడుగుపెడుతున్న విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు స్వాగతం పలికారు. అలాగే సీనియర్ విద్యార్థులకు జూనియర్ విద్యార్థులు ఫేర్వేల్ చెబుతూ పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాళాశాల ప్రిన్సిపాల్ విపి రాజు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని వాటి సాధనకు నిరంతరం కృషి చేయాలని కోరారు. విద్యార్థులు ఆటపాటలతో ఉత్సహాంగా పాల్గొన్నారు. అనంతరం స్పోర్ట్స్‌లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు.అలాగే అకాడమిక్ టాపర్ విద్యార్థులకు సర్టిఫికెట్‌లు,బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బెనర్జీ, సుజిత్, శాంతి శ్రీ, బాబు, ప్రేమ్, సునీత, పిఆర్ఒ రఘు తదితరులు పాల్గొన్నారు.

